ఈనాడు
అనంతపురం
బుధవారం అక్టోబరు 23, 2024




ఉప్పరపల్లి జగనన్న కాలనీ జలమయం

# జలదిగ్బంధం..

# అపార నష్టం

- ఉమ్మడి అనంత జిల్లాలో ముంపు కష్టం
- జనజీవనం అస్తవ్యస్తం
- నీట మునిగిన నగర శివారు కాలనీలు
- మూణ్నెళ్ల శ్రమ.. 3 గంటల్లో నేలమట్టం



అంబేడ్కర్‌కొట్టాల వద్ద కొట్టుకుపోతున్న ఆటో



ఉప్పరపల్లి కాలనీలో మునిగిన ఇళ్లు



పెనుకొండలో జాతీయ రహదారిపై చిక్కుకున్న బస్సుల్ని ప్రొక్లెయిన్‌తో పక్కకు లాగుతున్న పోలీసులు



కళాకారుల కాలనీలో ఇళ్ల మధ్య నీటిని మళ్లిస్తూ



వరద పరిస్థితిని అనంతపురం ఎస్పీ జగదీశ్‌తో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్



నగర శివారులో వరద బాధితులకు ఆహారం పంపిణీ

**ఈనాడు, అనంతపురం, న్యూస్‌టుడే, రాప్తాడు, పెనుకొండ, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి, రామగిరి, ఆత్మకూరు:** ఉమ్మడి అనంత జిల్లాలో కుండపోత వర్షానికి అన్ని మండలాల్లో చెరువులు పొంగిపొర్లాయి. మరువలు పారడంతో వంకలు పోటెత్తాయి. భారీ వర్షానికి సుమారు 18 మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో వరద ప్రవాహానికి రోడ్లు కోతకు గురయ్యాయి. కల్వర్టులు, వంతెనలపైకి భారీ ప్రవాహం కొనసాగడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి.

● రాప్తాడు మండలం బండమీదపల్లి, కనగానపల్లిలోని పలు చెరువులు ఉప్పొంగడంతో ఆ నీరంతా పండమేరులోకి చేరింది. మంగళవారం తెల్లవారుజామున కనగానపల్లి చెరువు కట్ట తెగి వరద పండమేరును ముంచెత్తింది. వంకకు రెండువైపులా కాలనీల్లోకి నీరు చేరింది. ఉప్పరపల్లి జగనన్న కాలనీలో ఇళ్లు సగం వరకు మునిగిపోయాయి. అకస్మాత్తుగా కాలనీల్లోకి వరద నీరు వచ్చి చేరింది. అంతా నిద్రలో నుంచి తేరుకునేలోపు ఇళ్లలోకి వరద ముంచెత్తింది. ప్రజలు మిద్దెల పైకి ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. అనంతపురం గ్రామీణం పరిధి కళాకారుల కాలనీ, ఉప్పరపల్లి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ, ఇందిరమ్మ కాలనీ, నగర పరిధిలోని రామకృష్ణ కాలనీ ముంపులోకి వెళ్లిపోయాయి. రెవెన్యూ, పోలీసు అధికారులు సహాయక చర్యలు ప్రారంభించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, తెదేపా ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల సునీత ముంపు కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.

## ఆక్రమణలే శాపంగా మారి..

కనగానపల్లి మండలంలో అత్యధికంగా 19 సెం.మీ. వర్షపాతం కురిసింది. పండమేరుకు ఇరువైపులా ఉన్న కాలనీలను వరద ముంచెత్తడానికి ఆక్రమణలు కూడా ఒక కారణమని చెబుతున్నారు. కొందరు వంకను పూడ్చి ఇళ్లు, ప్రార్థన మందిరాలు నిర్మించారు. కంపచెట్లు ఏపుగా పెరిగాయి. ప్రవాహం వేగంగా వెళ్లే వీలులేక ఎగువన ఉన్న కాలనీలు మునుగుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీటీ స్టేడియం ఎదురుగా వంతెన నుంచి పండమేరులో ఆక్రమణలు అధికంగా కనిపిస్తున్నాయి. వంకకు ఇరువైపులా ఆక్రమించి ఇటుక బట్టీలు. తాత్కాలిక నిర్మాణాలు చేపట్టడంతో ప్రవాహం దిశ మారిపోయింది. ఉప్పరపల్లి వైపు వెళ్తున్న కొద్దీ ఆక్రమణలతో వంక కుంచించుకుపోయింది. ఐదేళ్లలో స్థానిక వైకాపా నాయకులు వంకను ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయించేశారు. ఇంకొంతమంది వంక పోరంబోకుకు నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నారు. ఫలితంగా వంక ప్రవాహాలు ముందుకు సాగక కాలనీలను ముంచేస్తున్నాయి.

## జాతీయ రహదారిపై వరద..

కనగానపల్లి మండలవ్యాప్తంగా ఉన్న 13 చెరువులలోకి నిండుగా నీరు చేరాయి. వేరుసెనగ, వరి పొలాల్లో వర్షం నీరు ప్రవహించింది. ముక్తాపురం చెరువు మరువ పారి 44వ జాతీయ రహదారికి పక్కన పెట్రోలు బంకులోకి మూడు అడుగుల వరకు నీరు చేరింది. ముక్తాపురం వద్ద నీటి ప్రవాహానికి జాతీయ రహదారి వెంబడి బెంగళూరు నుంచి హైదరాబాద్ వెళుతున్న మూడు బస్సుల్లోకి నీరు చేరడంతో ఐదు గంటలపాటు అక్కడే నిలిచిపోయాయి.

● మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చెరువు కట్ట తెగి ఆయకట్టు కింద సాగు చేసిన 90 ఎకరాల వరి పంట నీట మునిగింది. చెరువులో నీరు మొత్తం కనగానపల్లి వంక మీదుగా రాప్తాడులోని పండమేరు వంక వెంబడి ప్రవహించాయి. చెరువు ఆయకట్టుకు ఆనుకొని ఉన్న సురేశ్‌బాబుకు చెందిన ఆరు ఎకరాల్లో వరి దెబ్బతిని రూ.4 లక్షల నష్టం వాటిల్లింది.

● సీకేపల్లి మండలం అమిదాలకుంట వద్ద ధర్మవరం-కొత్తచెరువు రహదారిపై వాహన రాకపోకలు నిలిచాయి. సీకేపల్లి, వెంకటాంపల్లి, ప్యాదిండి, న్యామద్దల తదితర గ్రామాల ప్రధాన రహదారులపై రాకపోకలు నిలిచాయి..

## కనగానపల్లిలో కుండపోత

గతంలో ఎన్నడూ లేనంతగా కనగానపల్లి మండలంలో 19 సెం.మీ. వర్షపాతం నమోదైంది. రామగిరిలో 9.8, చెన్నేకొత్తపల్లి 9.5, పెనుకొండ 8.9, కొత్తచెరువు 8.8, హిందూపురం 8.3 సెం.మీ.ల వర్షం కురిసింది. కళ్యాణదుర్గంలో 8.9, కంబదూరులో 6.5, ఆత్మకూరులో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

## మీ కష్టం చూస్తే కన్నీరొస్తోంది..



భారీ వర్షంతో నష్టపోయిన రైతులను చూస్తే కన్నీరు వస్తోంది. రైతులు ధైర్యం కోల్పోవద్దు ఆదుకుంటాం. రామగిరి మండలంలో వరద ధాటికి పంట నష్టపోయిన వివరాలను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లాం. చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండలాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తెగిపోయిన చెరువులను వెంటనే మరమ్మతులు చేయించాలని జలవనరుల శాఖ మంత్రి రామానాయుడుని కోరాం.

**- ఎమ్మెల్యే పరిటాల సునీత**



వనమిత్ర పార్కులో తలదాచుకున్న అంబేడ్కర్ కొట్టాలవాసులు



జగనన్న కాలనీలో మోకాల్లోతు నీటిలో బయటకు వస్తున్న బాధితులు

## తేరుకునేలోపు ముంపులోకి



ఉప్పరపల్లి జగనన్న కాలనీలో నివాసముంటున్నాం. మంగళవారం తెల్లవారుజామున నిద్ర నుంచి తేరుకునేలోపు ఇళ్లలోకి వరద వచ్చేసింది. చూస్తూ ఉండగానే కాలనీ మొత్తం మునిగిపోయింది. సామగ్రి కాపాడుకునే సమయం దొరకలేదు. కరెంటు సరఫరా నిలిచి ఎటూ పోలేని పరిస్థితి. పిల్లలు, వృద్ధులతో ఇబ్బందులు పడుతూనే సురక్షిత ప్రాంతానికి చేరుకున్నాం. సాయంత్రానికి వరద తగ్గింది.

**- రాజకుళ్లాయమ్మ, ఉప్పరపల్లి**

## 15 గంటలు వణికిపోయాం



పండమేరువాగు ఉప్పొంగడంతో వాగుకి ఆనుకుని జగనన్న కాలనీ మొత్తం ముంపునకు గురైంది. అర్ధరాత్రి ఆకస్మాత్తుగా ఇళ్లలోకి నీరు చేరి కట్టుబట్టలతో బయటకు రావాల్సి వచ్చింది. సాయంత్రం వరకు 15 గంటలు ఎటూ కదల్లేక ఉండిపోయాం. ప్రభుత్వం స్పందించి భవిష్యత్తులో ఇలాంటి ముంపు రాకుండా కరకట్ట ఏర్పాటు చేయాలి.

**- బాను, ఉప్పరపల్లి**

## ఉద్యోగులు, కార్మికులకు ఇబ్బంది

పెనుకొండ మండలం మునిమడుగు రెవెన్యూ పొలంలోగల కియా అనుబంధ పరిశ్రమలకు వెళ్లే రహదారి కోతకు గురైంది. అనంత టెక్, స్విఫ్ట్ సపోర్ట్ సర్వీసు, హ్యూండాయ్ గ్లోవిస్ సీకేడీ, వేర్‌హౌస్‌లకు వెళ్లే రహదారి కోతకు గురవడంతో 2 వేల మందికి పైగా కార్మికులు అవస్థలు పడ్డారు. అనుబంధ పరిశ్రమలకు ఉద్యోగులను తరలించే బస్సుల్ని గుట్టూరు శివారులోని ఈద్గా వద్ద నిలిపివేశారు. ఉద్యోగులు, కార్మికులు రహదారిపై ప్రమాదకరంగా నడుచుకుంటూ వెళ్లారు. ఇదే మండలంలోని వెంకటగిరిపాళ్యం చెరువు నిండిమరవ పారడంతో గుట్టూరు శివారులో 44వ జాతీయ రహదారిపై వరద పారింది. 8 గంటల పాటు రాకపోకలు ఒకే రోడ్డుపై కొనసాగాయి. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ఓ ట్రావెల్‌బస్సు, లారీ, కారు వరద నీటిలో చిక్కుకున్నాయి. కియా ఇండస్ట్రియల్ ఏరియా స్టేషన్ ఎస్సై రాజేశ్ సిబ్బందితో కలిసి రోడ్డు పై వాహనాదారులను అప్రమత్తం చేశారు.

## వరుస విషాదాలు.. కుటుంబం కుదేలు

రాప్తాడు మండలం బండమీదపల్లికి చెందిన పూజారి కుటుంబంలో ఒకే సంవత్సరంలో వరుస విషాదాలు చోట చేసుకున్నాయి. బండమీదపల్లి గ్రామం సల్లాపురమ్మ గుడి పూజారి మాధవయ్యకు భార్య లావణ్య, ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. మాధవయ్య తన పెద్ద కుమారుడు సల్లప్ప పాముకాటుకు గురై తొమ్మిది నెలల క్రితం చనిపోయాడు. సల్లాపురమ్మ గుడి పూజారిగా ఉన్న మాధవయ్య ఐదు రోజుల క్రితం అకస్మాత్తుగా మరణించడంతో కుటుంబం ఇంటి పెద్దను కోల్పోయింది. భార్య లావణ్య కుమారుడు, భర్త కోల్పోయి బాధను దిగమింగుకొని 80 మేకలను మేపుకొంటూ పిల్లలను చదివించి పెద్ద చేయాలి అనుకుంది. ఈలోపు ప్రకృతి వారిపై పగపట్టింది. బండమీదపల్లి చెరువుకు ఆనుకొని ఉన్న సల్లాపురమ్మ గుడివద్ద సోమవారం రాత్రి మేకలను తోలారు. సోమవారం అర్ధరాత్రి కురిసిన వర్షాలకు చెరువు నిండి గుడి వైపు ప్రాంతం నీట మునిగి మేకలు ఊపిరాడక చనిపోయాయి. మాకే ఎందుకు ఈ కష్టాలు దేవుడా అని బోరున విలపించడం స్థానికులను కంటతడి పెట్టించింది. ధర్మవరపు మురళి, గ్రామస్థులు అందరూ కలిసి వారికి లక్ష రూపాయులు ఆర్థిక సాయం అందించారు.



నీటిలో మునిగి ఊపిరి ఆడక చనిపోయిన మేకలు



కనగానపల్లిలో తెగిన చెరువు కట్ట..
ఈ నీటితోనే అనంతపురం శివారు కాలనీలు మునిగాయి



కనగానపల్లిలో మండలంలో నేలవాలిన వరి పంట

## పంటలు, ఇళ్లు ధ్వంసం..

● అనంత జిల్లాలో 10, శ్రీసత్యసాయి జిల్లాలో 8 మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ పంటలు 1,146 హెక్టార్లు, ఉద్యాన పంటలు 46 హెక్టార్లు, అనంత జిల్లాలో సాధారణ పంటలు 62 హెక్టార్లు, ఉద్యాన పంటలు 43 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు అధికారిక చెబుతున్నాయి. రెండు జిల్లాల్లో కలిపి రూ.5 కోట్ల వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. 50కి పైగా జీవాలు మరణించాయి. శ్రీసత్యసాయి జిల్లాలో 52 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 23 వరకు రహదారులు దెబ్బతిన్నాయి. చెరువులు ఉప్పొంగడంతో ఆయకట్టు కింద సాగుచేసిన వందలాది ఎకరాల్లో వరి నీట మునిగింది. కల్లాల్లో ఆర బెట్టిన వేరుసెనగ కొట్టుకుపోయింది.

# చీకట్లో వైద్యసేవలు

పురపాలిక : **గుంతకల్లు**
ఆసుపత్రి సామర్థ్యం : **వంద పడకలు**
రోజు వారి ఓపీ రోగుల సంఖ్య:
**700-750 మంది**

రోగులకు తప్పని తిప్పలు



నేత్ర చికిత్సా విభాగంలో చీకటిమయం..

**గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే:** గుంతకల్లులోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో జనరేటర్ వినియోగంలో లేకపోవడంతో చీకట్లోనే వైద్య సేవలు కొనసాగుతున్నాయి. వైద్యులు, రోగులకు తిప్పలు తప్పడం లేదు. మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రాంతీయ ఆసుపత్రిలో ఓపీ వేళలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. జనరేటర్ ఉన్నా వినియోగంలో లేదు. తరచూ వైద్యసేవలకు ఆటంకం ఏర్పడుతున్నా ఎవరికీ పట్టడం లేదు. ఇన్వర్టర్ల సేవలను కొన్ని గదులకు మాత్రమే అనుసంధానం చేశారు. ఫలితంగా వంద పడకల ఆసుపత్రిలో చీకట్లోనే సేవలందుతున్నాయి.

## పాత ఆసుపత్రి భవనంలో..

పాత ఆసుపత్రి భవనాల్లోని ఓపీ గదిలో కంటి పరీక్షలు నిర్వహించడానికి ఆటంకం ఏర్పడింది. చీకటిలోనే వైద్యులు టార్చ్ లైటు వెలుతురులో కంటి పరీక్షలు చేశారు. సదరం శిబిరం ఉండటంతో పింఛన్ ధ్రువపత్రం కోసం కర్నూలు, ఇతర ప్రాంతాల నుంచి రోగులు వచ్చారు. వారంతా ఇబ్బంది పడ్డారు.

## కిడ్నీ బాధితులకు ఆటంకం

ఆసుపత్రిలో ప్రైవేట్ ఆధ్వర్యంలో కిడ్నీ డయాలసిస్ కేంద్రం నడుస్తోంది. రోజుకి పది నుంచి 15 మంది బాధితులకు రక్తశుద్ధి చేస్తుంటారని కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఇక్కడా విద్యుత్తు తిప్పలు తప్పడం లేదు. రక్తశుద్ధి కేంద్రానికి 30 కేవీ జనరేటర్ అవసరం ఉందని డయాలసిస్ కేంద్రం మేనేజర్ మహేంద్ర చెబుతున్నారు.

## సమస్య పరిష్కారానికి కృషి

ఆసుపత్రిలో జనరేటర్ ఉంది. కనెక్షన్ ఇవ్వలేదు. వినియోగంలోకి తీసుకొచ్చే పనిలో ఉన్నాం. త్వరలో సమస్య పరిష్కారమవుతుంది. రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

**- డాక్టర్ అజేంద్రరావు, సూపరింటెండెంట్, ప్రాంతీయ ఆసుపత్రి, గుంతకల్లు**



డయాలసిస్ కేంద్రంలో..

# చెరువులపై నిత్యం నిఘా: కలెక్టర్

**జిల్లా సచివాలయం, బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే:** జల దిగ్బంధంలో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. పునరావాస కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించామన్నారు. చెరువులపై నిత్యం నిఘా ఉంచుతామన్నారు. మంగళవారం కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూంలో అత్యవసర శాఖల అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. పండమేరు వంక మ్యాపు పరిశీలించి ఎక్కడెక్కడ కాలనీలు నీటి మునిగాయన్న వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వంతో మాట్లాడి కర్నూలు నుంచి రెండు ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను తెప్పించామన్నారు. రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక వంటి శాఖలు స్పందించి 110 కుటుంబాలను రక్షించి..375 మందిని పునరావస కేంద్రాలకు తరలించామన్నారు. మంగళవారం తెల్లవారుజామున నగర సమీపంలోని బుక్కరాయసముద్రం చెరువును కలెక్టర్ పరిశీలించారు. చెరువులోకి వరద నీరు చేరుతోందని.. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



పండమేరు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, అధికారులు

# తుపాకీ కాల్పులు జరిపిందెవరు?

## కేసు విచారణకు రెండు పోలీసు బృందాలు

**ధర్మవరం, న్యూస్‌టుడే:** శ్రీసత్యసాయి జిల్లా, బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన తుపాకీ కాల్పుల ఘటనపై విచారణకు ప్రత్యేక పోలీసు బృందం హైదరాబాద్‌కు వెళ్లింది. పట్టపగలు జాతీయ రహదారిపై బస్టాప్ వద్ద కాల్పుల ఘటన జరగడాన్ని పోలీసు యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. అన్నమయ్య జిల్లా వీరపల్లి మండలం షికారీపాలెంకు చెందిన ముఠా సభ్యుడు కొమరి బంగారీ అనే యువకుడు బత్తలపల్లి పోలీసులకు పట్టుబడ్డాడు. కాల్పులు జరిపింది హైదరాబాద్‌కు చెందినవారు అని విచారణలో బంగారీ తెలపడంతో పోలీసులకు కీలక సమాచారం దొరికింది. గుప్తనిధులు దొరికాయని, తక్కువ ధరకే బంగారు నాణేలు, ఇతర ఆభరణాలు ఇస్తామని షికారీపాలెం ముఠా ఎరవేసి డబ్బు తీసుకొని మోసగిస్తున్నట్లు గుర్తించారు. కొమరి బంగారీతోపాటు రాణా రోర్, ఇలాచ్, రాణా హరీష్ ఇలా.. తెలంగాణలో పలువురిని బంగారం పేరుతో మోసగించినట్లు తేలింది. షికారీపాలెం ముఠాపై తుపాకీ కాల్పులు జరిపిన వ్యక్తులు హైదరాబాద్‌కు చెందినవారుగా సమాచారం లభించింది. వారు మరో ముఠాకు చెందినవారుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఇందులో ఒక హైదరాబద్‌కు చెందిన ఒక యూట్యూబర్ ఉన్నట్లు తెలిసింది. కేసు దర్యాప్తునకు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు రెండు పోలీసు బృందాలు వెళ్లాయి. కాల్పులు జరిపి పరారైనవారు సైబర్ క్రైమ్ పోలీసులమని చెప్పి పోలీసులను పక్కదారి పట్టించారు. ఘటన జరిగి మూడ్రోజులు గడిచినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. మరోవైపు షికారీపాలెం ముఠాకు చెందినవారూ పరారీలో ఉండటంతో పోలీసులు గాలిస్తున్నారు.

జాతీయ రహదారి..

# భద్రత కొరవడి

## పని చేయని నిఘా నేత్రాలు, వెలగని దీపాలు



అంబేడ్కర్ కాలనీ సమీపంలో జాతీయరహదారిపై పని చేయని నిఘానేత్రాలు, అంధకారం

**పామిడి, న్యూస్‌టుడే :** పామిడిలోని పలు ప్రధాన ప్రాంతాల్లో, జాతీయ రహదారిలో నిఘానేత్రాలు ఏర్పాటు చేసినా.. నిర్వహణ లేక అవి పని చేయడం లేదు. నేరాలను నియంత్రించే దిశగా తొమ్మిది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఎంతో ఆర్భాటంగా ప్రారంభించారు. నేరాల అదుపులో కీలకంగా మారిన సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజాప్రతినిధులు, దాతలు, వ్యాపారుల సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. మొదట్లో బాగానే పనిచేసినా నిర్వహణ, మరమ్మతులు సమస్యగా మారాయి.

### రాత్రిళ్లు కన్నుగప్పి.. అక్రమాలు

పెన్నానది నుంచి ఇసుకను తరలించాలంటే రాత్రిళ్లు జాతీయ రహదారి గుండా వెళ్లాల్సిందే. దీంతో అక్రమార్కులు 44వ జాతీయరహదారి ప్రధాన కూడళ్లల్లోని నిఘా నేత్రాలు, వాటి పక్కన అమర్చిన విద్యుద్దీపాలు వెలగకుండా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇదే అదునుగా ఇప్పటి వరకు అక్రమార్కులు అర్ధరాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా అంబేడ్కర్‌కాలనీ సమీపంలోని జాతీయ రహదారి కూడలి, వై-జంక్షన్ కూడలి, ఎద్దులపల్లి రోడ్డు కూడళ్లలో ఇసుక అక్రమ రవాణాతో పాటు గ్రావెల్, రేషన్ బియ్యం దందా కొనసాగుతోంది. ఇంత తతంగం నడుస్తున్నా అధికారులు మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. నేర నియంత్రణలో భాగంగా 100 మంది పోలీసులతో సమానంగా నిఘానేత్రాలు పనిచేస్తాయని చెబుతున్న పోలీసు అధికారులు తక్షణమే సీసీ కెమెరాల నిర్వహణ బాధ్యతను చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువలకు గండ్లు



హెచ్చెల్సీ గట్టుకు పడిన రంధ్రం

**కణేకల్లు, న్యూస్‌టుడే :** తుంగభద్ర హెచ్చెల్సీ 159.277 కి.మీ. ఎన్.హనుమాపురం యూటీ వద్ద మంగళవారం సాయంత్రం హెచ్చెల్సీ గట్టు మట్టి కుంగి రంధ్రం పడింది. కొద్దిగా నీరు లీకేజీ అవుతుండటం గమనించిన తెదేపా ఎంపీటీసీ సభ్యుడు నరేంద్రబాబు వెంటనే హెచ్చెల్సీ అధికారులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. జేఈ నరేంద్రమారుతి ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన పొక్లెయిన్‌తో రంధ్రం పూడ్చివేత పనులు చేపట్టారు. గట్టును పటిష్ఠం చేసి నీరు వృథా కాకుండా అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపట్టారు. ఈ ఏడాది హెచ్చెల్సీకి నీరు విడుదల కాక మునుపే ఇదే ప్రదేశంలో యూటీ గట్టు కుంగి పడిన రంధ్రాన్ని, యూటీ అడుగుభాగాన కాంక్రీట్ దెబ్బతిని పైకప్పునకు పడిన రంధ్రాన్ని పూడ్చివేసి మరమ్మతులు చేయించారు. శిథిలావస్థకు చేరిన యూటీ వద్ద తిరిగి అదే ప్రదేశంలో మట్టి గట్టుకు రంధ్రం ఏర్పడటం గమనార్హం. ఇటీవల తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రంధ్రం పడటంపై గట్టు పటిష్ఠతపై భయాందోళన వ్యక్తమవుతోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



పొక్లెయిన్‌తో రంధ్రం పూడ్చివేత పనులు చేయిస్తున్న అధికారులు

**సోమందేపల్లి:** భారీ వర్షాలకు మండలంలోని మంచేపల్లి గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువకు గండి పడింది. సోమవారం రాత్రంతా కురిసిన భారీ వర్షాలకు భారీగా చేరిన నీటి ప్రవాహానికి మంగళవారం హంద్రీనీవా కాలువ మట్టి కోతకు గురై తెగిపోయింది. దీంతో కాలువలోని నీరంతా మంచేపల్లి చెరువుకు చేరడంతో అది పూర్తిగా నిండిపోయి మరువ పారింది.

### వెంటనే మరమ్మతులు చేపట్టండి : మంత్రి

హంద్రీనీవా కాలువకు పడిన గండిని వెంటనే పూడ్చి, మరమ్మతులు చేయించాలని మంత్రి ఎస్.సవిత ఆదేశాలు జారీ చేశారు.



మంచేపల్లి సమీపంలో...

మంగళవారం సాయంత్రం ఆమె అమరావతి నుంచి చరవాణిలో హంద్రీనీవా సుజల స్రవంతి, జల వనరుల శాఖల ఇంజినీరింగ్ అధికారులతో మండలంలో నెలకొన్న పరిస్థితుల గురించి తెలుసుకొన్నారు. ఆనందపురంలో చెరువు నీటితో నిండిపోయి మరువ పారడంతో రైతుల వరి పంట పొలాలు నీట మునిగిన విషయాన్ని తెలుసుకొని, పంటలకు ప్రమాదం లేకుండా వెంటనే చర్యలు చేపట్టాలని, నివేదిక తయారు చేయించాలన్నారు.

## గుంతకల్లు - కదిరిదేవరపల్లి మధ్య రైలు రద్దు

**గుంతకల్లు, న్యూస్‌టుడే :** కదిరిదేవరపల్లి నుంచి రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా తిరుపతికి రోజూ రాకపోకలు సాగించే ప్యాసింజరు రైలును అధికారులు నవంబరు 1 నుంచి గుంతకల్లు-కదిరిదేవరపల్లి మధ్య రద్దు చేస్తున్నట్లు డివిజన్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయదుర్గం-కదిరి దేవరపల్లి మధ్య స్టేషన్లలో యార్డు ఆధునికీకరణ పనులు, రైల్వే సిగ్నలింగ్ పనులు చేపడుతుండంతో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. తిరుపతి నుంచి కదిరిదేవరపల్లికి వెళ్లే రైలు గుంతకల్లు-కదిరిదేవరపల్లి మధ్య నవంబరు 1 నుంచి 30 తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే కదిరిదేవరపల్లి నుంచి వెళ్లే రైలు నవంబరు 2 నుంచి డిసెంబరు 1వరకు రద్దు చేశారు. ఈ రైలు గుంతకల్లు-తిరుపతి మధ్య మాత్రమే రాకపోకలు సాగిస్తుందని వివరించారు.

# సత్యసాయి స్ఫూర్తి.. ప్రభుత్వ బడులకు దీప్తి

## వందలాది పాఠశాలలకు భక్తురాలి చేయూత



సుందరవల్లి దంపతులు

**పుట్టపర్తి, న్యూస్‌టుడే:** నిజమైన దేవుడు మందిరాల్లో కాదు.. ప్రజల హృదయాల్లో కొలువున్నారని సత్యసాయి బోధనలు ఆమెను కదిలించాయి. మానవసేవయే.. మాధవసేవగా భావించిన నిజమైన ఆరాధన అన్న సాయి సూక్తులు సేవవైపు నడిపించాయి. సత్య సాయి స్ఫూర్తితో సమాజానికి ఎంతో కొంత చేయాలనే గొప్ప మనసుతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.. విజయవాడకు చెందిన విశ్రాంత అచార్యులు సుందరవల్లిసురేష్. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలు సమకూరుస్తున్నారు.

### సేవల్లో కొన్ని..

- పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం రెండు అదనపు గదులు, కమ్యూనిటీ భవనం, భోజన సౌకర్యార్థం షెడ్డు నిర్మించారు. 75 మంది విద్యార్థులకు సైకిళ్లు అందించారు. రూ.30 లక్షల వరకు వ్యయం చేశారు.
- పుట్టపర్తి ప్రభుత్వ పాఠశాలలో నీటి శుద్ధి ప్లాంటు, 500 మంది విద్యార్థులకు అనుగుణంగా బల్లాలు, మరుగుదొడ్లు నిర్మించారు. దాదాపు రూ.12 లక్షలతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.
- జిల్లాలోని 22 ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 8.30 గంటలకు వందలాది మంది విద్యార్థులకు రోజూ అల్పాహారం సౌకర్యం కల్పిస్తున్నారు.



ఉదయం అల్పాహారం తీసుకుంటున్న బీడుపల్లి పాఠశాల విద్యార్థులు

### కోట్ల రూపాయల వ్యయంతో..

ప్రభుత్వ బడుల్లో అభ్యసించే విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. 2004లో సిద్ధార్థ కళాశాలలో అధ్యాపకురాలుగా పనిచేస్తున్న సుదరవల్లి సత్యసాయి పిలుపుతో పుట్టపర్తికి వచ్చేశారు. 2005 నుంచి శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మానవతా విలువలతో కూడిన విద్యా బోధన అందించారు. తలిదండ్రులు అడవికి వెళ్లగా విద్యార్థులు పడుతున్న కష్టాలు చూసి చలించిపోయారు. పాఠశాలల్లో అదనపు గదులు, సామాజిక భవనాలు, కంప్యూటర్లు, బల్లలు, నీటి శుద్ధిప్లాంట్లు, ఉదయం 8.30 గంటలకు అల్పాహారం సదుపాయం కల్పించారు. వీటితో పాటు గ్రామీణ ప్రాంతాల రహదారుల మరమ్మతులు, నిరుపేద మహిళలకు కట్టుమిషన్లు, గ్రైండర్లు, తోపుడుబండ్లు, నిత్యావసర వస్తువుల పంపిణీ చేస్తున్నారు. ఇవన్నీ ఖ్యాతి కోసం చేస్తున్న సేవలు కాదు.. ప్రచార ఆర్భాటం మచ్చుకైనా కనిపించదు.

### ఊపిరి ఉన్నంత వరకూ చేస్తా..

మానవ సేవయే.. మాధవసేవ అన్న సత్యసాయి స్ఫూర్తితో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నా, స్వచ్ఛంద పదవీ విరమణ చేసి పుట్టపర్తి వచ్చేశా. అప్పటి నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు విలువల విద్యాబోధనతో పాటు స్నేహితుల సహకారంతో మౌలిక సదుపాయాలు కల్పించాం. ఊపిరి ఉన్నంత వరకు సమాజానికి సేవ చేస్తా. **- సుందరవల్లిసురేశ్, భక్తురాలు**

## అనంతలో నాగార్జున సందడి





అభిమానులకు అభివాదం చేస్తున్న అక్కినేని నాగార్జున

**అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే:** సినీ నటుడు అక్కినేని నాగార్జున అనంతలో సందడి చేశారు. మంగళవారం నగరంలోని సూర్యనగర్ రోడ్డు సమీపంలోని కల్యాణ్ జ్యువెలర్స్ షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతలో ఆయన మాట్లాడుతూ.. అనంత అభిమానుల ప్రేమ మరువలేనిదన్నారు. ఆయన చూసేందుకు అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేశ్ కల్యాణ్‌రామన్, సిబ్బంది పాల్గొన్నారు.

## చాగల్లు జలాశయం నుంచి నీరు విడుదల

**పెద్దపప్పూరు, న్యూస్‌టుడే :** మండలంలోని చాగల్లు జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీటిని అధికారులు మంగళవారం పెన్నానదికి విడుదల చేశారు. పై ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో రూ.150 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతున్నట్లు హెచ్చెల్సీ ఏఈ హరినాథ్ తెలిపారు. జలాశయంలోకి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉండడంతో ముందుజాగ్రత్తగా నీటిని నదికి విడుదల చేసినట్లు ఏఈ చెప్పారు. నది పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## ఆలయంలోకి వరద ఆపేలా చర్యలు



వరద సమస్యపై ఆరాతీస్తున్న ఆర్డీవో, ఈవో, ఇతర అధికారులు

**కదిరి, న్యూస్‌టుడే:** భారీ వర్షాలకు ఖాద్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోకి వరద పారకుండా ఆపేందుకు అధికారులు మంగళవారం చర్యలు చేపట్టారు. 'ఖాద్రీశా.. వరద ముప్పు తప్పేనా?' శీర్షికన 'ఈనాడు'లో శనివారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు అధికారులు స్పందించారు. వరద ప్రవాహం ఆలయ మీదుగా రాకుండా ఆపేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్నదానిపై చర్చించారు. ఇందులో భాగంగా ఆర్డీఓ వెంకట సన్యాసిశర్మ, ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ పోలప్ప, మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ వీధిగుండా వచ్చే వరద నీటిని ధ్వజస్తంభం ముందునుంచే మళ్లించేలా కాలువ నిర్మాణం చేపట్టాలని చర్చించారు. మురుగు, వరద నీరు సులభంగా ఆలయం వైపు రాకుండా సజావుగా వెళ్లేలా కాలువ వెడల్పును పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆలయ తిరుమాడవీధుల్లో డ్రైనేజీల్లో పూడికను సత్వరం తొలగించేలా పనులు చేపట్టాలని ఆర్డీఓ మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

## ఐటీఐలో ప్రవేశాలు

**జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే:** ప్రభుత్వ బాలికల ఐటీఐలో ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నందకుమార్ తెలిపారు. బాలికలకు ప్రత్యేకంగా దుస్తుల తయారీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 27న ధ్రువపత్రాల పరిశీలన, 28న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు.

# ఉపాధి పనుల్లో రూ.78 లక్షలు దుర్వినియోగం



సామాజిక తనిఖీ బహిరంగ వేదికలో వివరాలను వెల్లడిస్తున్న విజిలెన్స్ అధికారి రమణారెడ్డి

**ఉరవకొండ, న్యూస్‌టుడే :** ఉరవకొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఉపాధి హామీ పథకం బహిరంగ వేదిక డ్వామా పీడీ సలీంబాషా, విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎంపీడీఓ రవిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రూ.9.15 కోట్ల విలువైన పనులు జరగ్గా.. మొత్తం రూ.78,66,935 దుర్వినియోగమైనట్లు సామాజిక తనిఖీ బృందం తమ పరిశీలనలో గుర్తించి బహిరంగ వేదికకు నివేదించింది. అయితే అధికారులు రూ.9.29 లక్షలు మాత్రమే రికవరీకి ఆదేశించారు. రూ.7.26 లక్షలకు సంబంధించి పరిశీలన చేయాలని సూచించారు. మండల ఉపాధి అధికారులు, సిబ్బందికి రూ.1.73 లక్షల అపరాధరుసుము విధించారు. మరో రూ.62.11 లక్షల విలువైన పనులకు సంబంధించిన ఫొటోలు, ఇతర వివరాలను ఉపాధి సిబ్బంది చూపడంతో ఆ మొత్తాన్ని అధికారులు మినహాయించారు. అయితే ఈ బహిరంగ వేదికకు వైకాపా హయాంలో పని చేసిన క్షేత్ర సహాయకులు హాజరు కాలేదు. వారు అక్రమాలకు పాల్పడి ఉండడంతోనే ఎవరూ అక్కడికి రాలేదన్న చర్చ సాగింది. కార్యక్రమంలో తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులకు నిధులు మంజూరు

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం గ్రాంట్ మంజూరు చేసింది. అనంతపురం జిల్లాలోని పాఠశాలలకు రూ.2.68 కోట్లు, సత్యసాయి జిల్లాకు రూ.2.27 కోట్లు మంజూరు చేసింది. దీంతో పాటు ఎమ్మార్సీ గ్రాంటు కూడా మంజూరు చేశారు. అనంత జిల్లాకు రూ.40.3 లక్షలు, శ్రీసత్యసాయి జిల్లాకు రూ.41.6 లక్షలు మంజూరయ్యాయి.

# కబ్జా కోరల్లో ప్రభుత్వ స్థలం

## రూ.కోటికి పైగానే మార్కెట్ విలువ



తాటిచెట్లను కూల్చివేసి చదును చేసిన అక్రమార్కులు

**గుత్తి, న్యూస్‌టుడే :** గుత్తికి చెందిన ఇద్దరు నాయకులు రూ.కోటి విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారు. సర్వే నంబర్ 643లో సుమారు ఎకరన్నర ప్రభుత్వ స్థలం ఉండగా ఆ స్థలంపై మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు, మాజీ కౌన్సిలర్ భర్త కన్నువేశారు. పథకం ప్రకారం ఆ స్థలంలో ఉన్న తాటిచెట్ల కొట్టేశారు. తర్వాత స్థలాన్ని విక్రయానికి అనుకూలంగా చదును చేయించారు. ఇది లచ్చానిపల్లి జగనన్నకాలనీ సమీపంలోని కావడం గమనార్హం. సదరు నాయకులు పదేళ్ల నుంచి ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆక్రమించి ఇతరులకు విక్రయించి రూ.కోట్లు కూడగట్టుకోవడమే పనిగా పెట్టుకున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి వద్ద విలువైన స్థలాల దస్త్రాలు ఉన్నాయి. తద్వారా గుత్తిలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడున్నాయో గుర్తించి వాటిని కబ్జా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### అహుడా పరిధిలోనూ ఆక్రమణలే

జగనన్న కాలనీతోపాటు అహుడాకు చెందిన ఎంఐజీ కాలనీ ఉంది. అక్కడ సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ప్రజల నివాస ప్రాంతం కావడంతో అక్కడ స్థలాలకు డిమాండు ఉంది. ఇప్పుడు తాటిచెట్లను తొలగిస్తూ ప్రభుత్వ స్థలాన్ని చదును చేస్తున్నారు. పొక్లెయిన్‌తో చెట్లను కూల్చివేస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వీఆర్‌వో సురేంద్ర మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దారు ఓబులేశు దృష్టికి తీసుకువెళ్లారు. ఆక్రమణలను అడ్డుకొని ప్రభుత్వ స్థలాలను కాపాడుతామని తహసీల్దారు తెలిపారు.

## శ్రీగంధం చెట్టు కొట్టి.. దుంగలు ఎత్తుకెళ్లి..



చెట్టు నరకడంతో మోడుగా ఇలా..

**రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే :** పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ప్రాంగణంలో జడ్జి నివాస ప్రాంగణంలో ఉన్న శ్రీగంధం చెట్టును గుర్తు తెలియని వ్యక్తులు నరికి దుంగను ఎత్తుకెళ్లారని యూపీఎస్ సీఐ జయనాయక్ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఒక చెట్టును రంపంతో కోసి దుంగను ఎత్తుకెళ్లారన్నారు. మరొక చెట్టును కోసేందుకు ప్రయత్నం చేసి మధ్యలోనే ఆపి వెళ్లిపోయారన్నారు. విషయం తెలుసుకుని సీఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

## చిరుతల సంచారంతో భయాందోళన

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దేవాదులకొండ - ఒంటిమిద్ది గ్రామాల మధ్యలో ఉన్న కొండపై మూడు చిరుతలు మంగళవారం ఉదయం పొలాలకు వెళ్తున్న రైతులకు కనిపించాయి. అవి అక్కడే తిరుగుతూ, అరుస్తున్నాయని వారు తెలిపారు. చిరుతలు ఎప్పుడు ఎటు వైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవి శాఖాధికారులు స్పందించి వాటిని బంధించి ఇతర ప్రాంతానికి తరలించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ బీట్ అధికారి నాగేనాయక్‌ను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారులకు తెలియజేశానన్నారు. జాగ్రత్తగా రైతులు, ప్రజలు ఉండేలా అవగాహన కల్పిస్తామన్నారు.

## ఉరుములు, మెరుపుల శబ్దానికి ఉపాధ్యాయుడి హఠాన్మరణం

**తాడిమర్రి, న్యూస్‌టుడే:** ఉరుములు, మెరుపుల శబ్దానికి కునుకుంట్ల గ్రామానికి చెందిన సాకే సూర్యనారాయణ(35) అనే యువకుడు హఠాన్మరణం చెందాడు. మంగళవారం మృతుడి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. సూర్యనారాయణ బత్తలపల్లిలో ఉంటూ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం కడపకు వెళ్ళి ఉపాధ్యాయ అర్హత పరీక్ష రాసి సోమవారం కునుకుంట్ల గ్రామానికి కుటుంబంతో సహా వచ్చారు. అదే రోజు రాత్రి గ్రామంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో మూత్ర విసర్జనకు బయటకు వచ్చారు. వెంటనే ఇంట్లోకి వెళ్లి కిందపడిపోవడంతో భార్య గమనించి బంధువులకు సమాచారం ఇచ్చి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. భార్య ప్రస్తుతం 6 నెలల గర్భిణి కావడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి మరణంతో ముగ్గురు చిన్నారులు అనాథలుగా మారారు. ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.



సూర్యనారాయణ



అనాథలుగా మారిన చిన్నారులు

## పిడుగుపాటుకు జీవాల మృత్యువాత



మృతిచెందిన మేకలు

**ముదిగుబ్బ, న్యూస్‌టుడే:** మండలంలోని పొడరాళ్లపల్లిలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పిడుగు పాటుకు 32 మేకలు చనిపోయాయి. సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని గొర్రెల కాపరి రామ్మోహన్ వాపోయాడు. విషయం తెలుసుకున్న తెదేపా హిందూపురం సోషల్‌మీడియా కోఆర్డినేటర్ హేమలతాబాయి, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మనోహర్, ఎంపీపీ ఆదినారాయణయాదవ్ పరిశీలించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో గొర్రెల కాపరికి ఫోన్లో మాట్లాడించారు. నష్టపరిహారానికి ప్రభుత్వం నుంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్టు

**రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** రాయదుర్గంలోని సిద్ధేశ్వర కాలనీకి చెందిన నాయకుల బొమ్మన్న (51) హత్య కేసులో ప్రధాన నిందితుడు, ఆయన కుమారుడు నాగరాజును మంగళవారం అరెస్టు చేసినట్లు రాయదుర్గం యు.పి.ఎస్. సి.ఐ. జె.జయనాయక్ తెలిపారు. ఈ నెల 19వ తేదీన బొమ్మన్న సరిహద్దు కర్ణాటకలోని పెదారగుడ్డం గ్రామంలోని వ్యవసాయ తోటలో పనులు ముగించుకొని రాయదుర్గం వస్తుండగా తండ్రి, కుమారుడు ఘర్షణ పడ్డారు. నిందితుడు నాగరాజు భార్య ఆశ ప్రవర్తనపై తండ్రి బొమ్మన్న గొడవపడటంతో మాటా మాటా పెరిగింది. అతను ఆవేశంతో తన వెంట తెచ్చుకున్న కొడవలితో రెండు సార్లు తండ్రిని నరకడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి రోడ్డు ప్రమాదం జరిగినట్లు చిత్రీకరించి బంధువులకు తెలిపాడు. హత్య విషయం బయట పడటంతో అతను పరారీలో ఉన్నాడు. బొమ్మన్న భార్య శివమ్మ తన కుమారుడిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ మేరకు రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నాగరాజును అరెస్టు చేశారు. హత్య కేసును అనతి కాలంలోనే ఛేదించిన సి.ఐ.జయనాయక్, సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

## భవన నిర్మాణ కార్మికుడి మృతి

**బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే :** బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీలో కొట్టాలపల్లికి చెందిన మల్లికార్జున (36) అనే వ్యక్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన రఫీతో ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. ఈక్రమంలో ఇద్దరం మాట్లాడుకుందామని రాఘవేంద్ర కాలనీ దగ్గర కలిశారు. మల్లికార్జున, రఫీతో పాటు వారి వెంట వచ్చిన వారితో పరస్పరం గొడవపడి కొట్టుకున్నారు. కొద్దిసేపటి తర్వాత మల్లికార్జున ఒక్కసారిగా కిందపడి మృతిచెందాడు. బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు అనంతపురం వైద్యశాలలో మృతదేహాన్ని పరిశీలించారు. శవపరీక్షల నివేదిక వచ్చిన తర్వాత విషయం తెలుస్తుందని డీఎస్పీ తెలిపారు. ఈఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## విద్యుదాఘాతంతో రైతు...

**గుమ్మఘట్ట, న్యూస్‌టుడే :** మండలంలోని కోనాపురంలో విద్యుత్తు తీగ తగిలి రైతు మారెన్న (55) మంగళవారం మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. అతను స్తంభం ఎక్కి కర్రతో సర్వీసు తీగను తొలగిస్తుండగా ఒక తీగ అతనిపై పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని గుమ్మఘట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి భార్య నీలమ్మ, కుమార్తె ఉన్నారు. స్థానిక ఎస్ఐ ఈశ్వరయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకుల దుర్మరణం



వినోద్



అశోక్

**కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు యువకులు మృతి చెందారు. కూడేరు మండలం శివరాంపేట వద్ద సోమవారం కారు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. వారిలో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన వినోద్ (22), సింగంపల్లికి వాసి అశోక్ (21) అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం వేకువజామున మృతి చెందారు. ఇదే ప్రమాదంలో గాయపడిన కూడేరుకు చెందిన మరో యువకుడు దామోదర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాలకు శవ పరీక్ష చేయించి, వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



భానుప్రకాశ్‌రెడ్డి

**నార్పల, న్యూస్‌టుడే:** నార్పల మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భానుప్రకాశ్‌రెడ్డి(19) అనే యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సుల్తాన్‌పేటకు చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి, స్నేహితులు ప్రణీత్, సతీష్‌తో కలిసి సాయంత్రం ద్విచక్రవాహనంలో నార్పలకు బయలుదేరారు. పెట్రోల్ బంక్ వద్దకు రాగానే వేగంగా వస్తున్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొనడంతో భానుప్రకాష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ప్రణీత్, సతీష్ కూడా గాయపడటంతో స్థానికులు, పోలీసులు మెరుగైన వైద్య కోసం అనంతపురం వైద్యశాలకు తరలించారు. నార్పల ఎస్సై సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో కళాశాల సిబ్బంది

## ఉద్యోగాలకు పలువురి ఎంపిక

**రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే :** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో 65 మంది అభ్యర్థులు హాజరవగా 51 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సామ్లానాయక్, రామకృష్ణారెడ్డి, షబానా, కంపెనీ ప్రతినిధులు మస్తాన్, సావిత్రమ్మ, ఏపీఎస్డీసీ కోఆర్డినేటర్ రాము తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు చిన్నహోతూరు విద్యార్థులు

**వజ్రకరూరు, న్యూస్‌టుడే :** మండలంలోని చిన్నహోతూరు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఎనిమిదో తరగతి చదువుతున్న వరుణ్ కుమార్, జ్యోతిరామ్ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బసవలింగప్రసాద్ తెలిపారు. ఆదివారం గుంతకల్లులోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో జరిగిన అండర్-18 జూనియర్ ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. వారిద్దరూ ఈ నెల 25, 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే పోటీలల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు పీడీ ప్రభాకర్, నాగరాజు, మస్తాన్, మునీంద్ర, నారాయణస్వామి, మల్లికార్జున, కృష్ణ, రజని కుమారిలు అభినందించారు.


పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## 'సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తాం'

**రాయదుర్గం :** పురపాలక సంఘంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే దశల వారీ ఆందోళనలతోపాటు నిరవధిక సమ్మె చేయటానికి వెనకాడమని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పట్టణ సీఐటీయూ కార్యదర్శి బి.మల్లికార్జున హెచ్చరించారు. పట్టణంలోని శ్రీ సంతాన వేణు గోపాలస్వామి ఆలయంలో జరిగిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి నెలా సాంకేతిక లోపంతో అవుట్ సోర్సింగ్ కార్మికులకు సక్రమంగా జీతాలు చెల్లించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కోశాధికారి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి మల్లేశ్, నాయకులు తిప్పేస్వామి, కామాక్షి, తిప్పేరుద్ర, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## సాఫీగా సర్వసభ్య సమావేశం

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మారుతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం సాఫీగా జరిగింది. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు.

# అతివల జీవితాల్లో ఆర్థిక వెలుగులు

- స్వయం ఉపాధితో రాణింపు
- మెప్మాతో లక్ష్యసాధన


కిరాణా దుకాణం నిర్వహిస్తున్నచేస్తున్న కె.సుజాత

**అ**వకాశాల్ని అందిపుచ్చుకోవటం, సమర్థవంతంగా సద్వినియోగం చేసుకోవటం.. దక్కిన రుణంతోనే బంగారు భవితకు నిచ్చెనలు వేసుకోవటం ఎలాగో రాయదుర్గం, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. పేదరికాన్ని జయించాలన్న సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు పొదుపు మార్గాన్ని ఎంచుకున్నారు. పేదరికంపై సాగించిన పోరులో పొదుపే వజ్రాయుధమైంది. అకుంఠిత దీక్షతో చేసిన ప్రయత్నం సఫలమైంది.

**రాయదుర్గం:** ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురుచూడకుండా పట్టణానికి చెందిన మహిళా సంఘాలు ప్రభుత్వ సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబనతో ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రతి నెలా సక్రమంగా పొదుపు చేస్తూ ఆ డబ్బును సంఘ సభ్యులకు వడ్డీకి ఇస్తూ ముందడుగు వేస్తున్నాయి. జీన్స్ దుస్తుల తయారీ, చీరల విక్రయాలు, కిరాణా వ్యాపారం, వడియాలు, ఓళిగలు, రొట్టెలు తయారీ, బేకరీ మిఠాయిల తయారీ, ఇలా ఒకటేంటి అనేక రంగాల్లో దూసుకెళ్తున్నారు. అతివలు రూ.20, 50 వేలు రూ.1 లక్ష నుంచి 5 లక్షలు, 10 లక్షలు, 20 లక్షల వరకు ప్రభుత్వ సాయాన్ని పొంది ప్రగతి చూపుతూ ప్రత్యేకంగా నిలిచారు.

**1100ల సంఘాలకు రుణ పరపతి :** పట్టణంలో మొత్తం 1,373 మహిళా సంఘాలు ఉండగా 13,730 మంది సభ్యులు ఉన్నారు. రూ.22 కోట్లకు పైగా పొదుపు చేశారు. వారిలో గత ఐదేళ్లుగా 11 వేల సంఘాలకు రూ. 165 కోట్లమేర బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేశారు . 2024-25వ ఆర్థిక సంవత్సరంలో 207 సంఘాలకు రూ. 27 కోట్ల దాకా రుణాలు మంజూరు చేశారు. సంఘంలో పావలా వడ్డీ కూడా వర్తిస్తోంది.

### చీరల వ్యాపారంతో స్వావలంబన



సిద్ధేశ్వర మహిళా సంఘంలో సభ్యురాలిగా ఉంటూ చీరల వ్యాపారం చేస్తున్నా. వచ్చిన ఆదాయంతో సొంతిల్లు నిర్మించుకున్నా. కుమారుడిని డిప్లమో చదివించాను. ప్రస్తుతం వార్డు సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్నాడు. మెప్మాతో ఆర్థిక స్వావలంబన సాధ్యమైంది. **- విజయలక్ష్మి, సిద్ధేశ్వర మహిళా సంఘం, రాయదుర్గం.**

### కిరాణా దుకాణం నిర్వహణలో..

పది మంది సభ్యులతో వరసిద్ధి వినాయక సంఘాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి నెలా పొదుపు చేసి సంఘ సభ్యులకు వడ్డీలకు ఇచ్చి పొదుపు సొమ్ము పెంచుతున్నాం. నాకు ప్రభుత్వం, బ్యాంకు మంజూరు చేసిన రూ.2 లక్షల రుణంతో కిరాణా దుకాణం నిర్వహిస్తున్నా. మా కుటుంబం సాఫీగా సాగుతోంది. నెలనెలా బ్యాంకుకు కంతు సక్రమంగా చెల్లిస్తున్నాం. **- కె.సుజాత, అధ్యక్షురాలు, వరసిద్ధి వినాయక సంఘం, రాయదుర్గం**

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని మెప్మా పరిధిలో 1,114 మహిళా సంఘాలు, 11,345 మంది సభ్యులకు ఐదేళ్లలో బ్యాంకు లింకేజీలు రూ.130.04 కోట్లు మంజూరయ్యాయి. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 6,240 మహిళా సంఘాలు ఉండగా, 64,954 మంది సభ్యులకు రూ.451.36 కోట్లు, స్త్రీనిధి రూ. 37.18 కోట్లు మంజూరయ్యాయి.

### కుటుంబానికి భరోసాగా నిలుస్తూ..


సుభద్రమ్మ, మంగళకుంట గ్రామం, కళ్యాణదుర్గం మండలం

నేను 15 ఏళ్లుగా అనంత మహిళా సభ్యులుగా చేరాను. మొదట్లో సంఘానికి రూ.50 వేలు వంతున రుణం రాగా, అందులో నాకు రూ. 5వేలు వచ్చింది. గత పదేళ్ల నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.2 లక్షల వరకు రుణాలు పొందాను. వాటి ద్వారా ఇంటి వద్ద బ్యాంగిల్ స్టోర్స్, చీరల వ్యాపారం చేస్తున్నా. చీరలు, గాజుల వ్యాపారం చేస్తూ రోజువారి ఆదాయాన్ని పొందుతూ కుటుంబానికి భరోసాగా నిలుస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నాను. ఇద్దరి పిల్లలకు పెళ్లిళ్లు చేశాను.
**- సుభద్రమ్మ, మంగళకుంట, కళ్యాణదుర్గం మండలం**


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

## హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ప్రతిభ

**కళ్యాణదుర్గం :** ఈ నెల 20వ తేదీ అనంతపురంలో జరిగిన జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీల్లో తమ పాఠశాలకు చెందిన శ్రీసాయి, సాయిచరణ్, సాత్విక్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా పరిషత్ (నార్తు) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని గాయత్రి బాయి, పీడీ కిరణ్ చౌదరి తెలిపారు. మంగళవారం ఆ పాఠశాల ఆవరణంలో వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ వారు ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు విజయనగరం జిల్లా కొత్తవలసలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భద్రకాళికి ప్రత్యేక పూజలు

**రాయదుర్గం, న్యూస్‌టుడే :** పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం మధ్యాహ్నం భద్రకాళి అమ్మ వారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

## ఉచిత న్యాయ సేవలపై అవగాహన

**కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే :** గ్రామీణ ప్రజలు ఉచిత న్యాయ సేవలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్ అన్నారు. కూడేరు మండలం ఉదిరిపికొండ తండాలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. ఎస్టీలు ఉచితంగా న్యాయ సేవలు పొందడానికి అర్హులన్నారు. గ్రామాల్లో ఏవైనా ఇబ్బందులు కలిగితే వాటిని న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావచ్చన్నారు. వాటిని పరిశీలించి, పరిష్కరించడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎలాంటి వారు ఉచిత న్యాయాన్ని పొంద వచ్చో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్‌బాషా, జిల్లా గిరిజన సంక్షేమాధికారి రామాంజనేయులు, ఆయా శాఖలకు చెందిన మండల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్

## గ్యార్మీ వేడుకల్లో ఎమ్మెల్యే కాలవ

**రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే :** స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వన్నూరుస్వామి కట్ట సమీపంలో గార్మీ వేడుకలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. విందు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవిబాబు, సీఐలు జయనాయక్, వెంకటరమణ, ఎస్ఐ బాలరాజు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.


జెండాకట్టా వద్ద ఎమ్మెల్యే కాలవ, మత పెద్దలు

## వైద్య సేవలపై ఆరా

**కళ్యాణదుర్గం గ్రామీణం:** అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలందించాలని అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న వైద్యులకు, సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సౌకర్యాలు, వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది హాజరు, రోగులకు సంబంధించిన దస్త్రాలు పరిశీలించారు. పంచనామా గది నిర్మాణానికి కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు. వైద్యులు శివకుమార్, హర్షద్, అస్మాత్‌రన్నుం, హెడ్‌నర్స్ సుగుణ, పాల్గొన్నారు.

**అప్రమత్తంగా ఉండండి**

డి.హీరేహాళ్ (రాయదుర్గం పట్టణం): వాగులు, వంకలు, చెరువుల లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిక్షణ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్డీఓ వినూత్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సోమలాపురం పరిధిలో ప్రమాదకరంగా ఉన్న చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. మరి కొద్ది రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున స్థానిక అధికారులు నీటి వనరులపై నిఘా ఉంచాలని తెలిపారు. ఆమె వెంట తహసీల్దారు అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


రోగులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

## బీటీపీకి నిధులు కేటాయించాలని వినతి

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** బీటీపీకి హంద్రీనీవా నీటిని తీసుకెళ్లేందుకు నిధులు కేటాయించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. మంగళవారం విజయవాడలోని ఆ శాఖ కార్యాలయంలో మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందించేందుకు నిధులు కేటాయించాలని విన్నవించారు. నియోజకవర్గ ప్రజల కలను సాకారం చేసేలా సాగునీరు తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. నిధులు కేటాయిస్తే పనులు చేపడతామన్నారు.


మంత్రి రామానాయుడుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమిలినేని

## మారెమ్మ దేవతకు బోనాల జాతర

**కంబదూరు, న్యూస్‌టుడే :** కంబదూరులో నూతన మారెమ్మ ఉత్సవ విగ్రహం ఏర్పాటు సందర్భంగా మంగళవారం మహిళలు జ్యోతులు, బోనాలను ఊరేగించారు. ఉపవాసాలతో వాటిని ఆలయానికి తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ దేవత శాంతి కోసం పశువులను బలిచ్చారు. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. గ్రామంలో పెద్దలు, పిల్లలు కొత్త దుస్తులు ధరించడంతో పండగ వాతావరణం నెలకొంది.


కంబదూరు: జ్యోతులు, బోనాలతో వెళ్తున్న భక్తులు

## వేడుకగా అమ్మవార్ల విగ్రహాల ప్రతిష్ఠాపన

**కణేకల్లు, న్యూస్‌టుడే :** మండలంలోని నాగేపల్లిలో మంగళవారం కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**ఉరవకొండ, న్యూస్‌టుడే :** మండలంలోని షేక్షానుపల్లిలో మంగళవారం దేవమ్మ, మారెమ్మ అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేకువజామున నుంచే అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అనంతరం అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

## తెదేపా సీనియర్ నాయకుడి మృతికి సంతాపం

**రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** రాయదుర్గం మండలం కాశీపురం గ్రామానికి చెందిన తెదేపా సీనియర్ నాయకుడు కావలి గిరిధర్ నాయుడు (62) అనారోగ్యంతో బెంగళూరులో చికిత్స పొందుతూ మంగళవారం మరణించారు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తెదేపా నాయకులు హనుమంతు, హనుమంతరెడ్డి తదితరులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని తెదేపా అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గిరిధర్ నాయుడు మరణ వార్త విన్న ఆయన అన్న శీనప్ప అనంతపురంలో చికిత్స పొందుతూ షాక్‌కు గురై మరణించాడు. ఒకే రోజు అన్నా తమ్ముడు మరణించడం కుటుంబాన్ని తీవ్ర దుఃఖానికి గురిచేసింది. గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

## మాజీ ఎంపీ వ్యాఖ్యలపై ఆగ్రహం

**కళ్యాణదుర్గం గ్రామీణం :** ప్రజా సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు మాజీ ఎంపీ మాధవ్‌కు లేదని తెదేపా నాయకులు పేర్కొన్నారు. నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరికలు చేశారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌పై మాజీ ఎంపీ చేసిన వ్యాఖ్యలపై వారు ఆగ్రహించారు. మంగళవారం స్థానిక ప్రజావేదిక వద్ద సీనియర్ నాయకులు మల్లికార్జున, ఆర్.జి.శివశంకర్, డి.కె.రామాంజనేయులు, నాగరాజు విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎంపీ ఇష్టానుసారంగా మాట్లాడితే సహించేది లేదని, పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.

## దళారుల మాటలు నమ్మొద్దు

**కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే :** అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారులు చెప్పే మాటలకు నమ్మి మోసపోకండని సీడీపీఓ లక్ష్మీప్రసన్న సూచించారు. మంగళవారం కళ్యాణదుర్గంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 24న ఉదయం 10 గంటలకు ఆర్డీఓ కార్యాలయంలో ముఖాముఖి నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో హాజరవ్వాలన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు అడిగితే వెంటనే అవినీతి నిరోధక శాఖ వారికి సమాచారం తెలియజేయాలన్నారు.

## వర్షం.. తెచ్చిన కష్టం!


బొమ్మనహాళ్ : ఉద్దేహాళ్ వద్ద వేదవతి హగరి కాజ్‌వేపై ఉద్ధృతంగా నీటి ప్రవాహం


బొమ్మనహాళ్ : కల్లుదేవనహళ్లి వద్ద వేదవతి హగరి పరవళ్లు


కళ్యాణదుర్గం గ్రామీణం : కుంగిన ముద్దినాయనపల్లి చెరువు కట్ట


కణేకల్లు : తాత్కాలిక రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు


కళ్యాణదుర్గం గ్రామీణం: ముద్దినాయనపల్లిలో కూలిన ఇల్లు

**రా**యదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. రాయదుర్గం, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని మురుగు కాలువలు పొంగిపొర్లాయి. లోతట్టు కాలనీలు, ఇళ్లలోకి నీళ్లు చేరాయి. వర్షపు నీటి ప్రవాహం ధాటికి చాలా చోట్ల తారురోడ్డు కొట్టుకుపోయింది. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. హగరి, వేదవతి నదులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. **- న్యూస్‌టుడే బృందం**


రాయదుర్గం : వజ్రహొన్నూరు గ్రామం వద్ద కొట్టుకుపోయిన వేరుసెనగపంట


పి.టి.ఆర్.తండాలో నీట మునిగిన మిరప పంట


కళ్యాణదుర్గం : సాయిబాబా ఆలయం వద్ద కోతకు గురైన రోడ్డు

## ద్విచక్రవాహనం, కారు ఢీ

**వజ్రకరూరు, న్యూస్‌టుడే :** మండలంలోని పీసీ ప్యాపిలి గ్రామ సరిహద్దు సమీపాన సోమవారం ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. గడేహోతురుకు చెందిన దివాకర్ వెంకటాంపల్లి నుంచి ఉరవకొండ ప్రభుత్వం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పీసీ ప్యాపిలి గ్రామ సమీపాన సుజలాన్ విండ్ పవర్ కంపెనీ వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో దివాకర్ తలకు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. ఆ దారిన వెళ్తున్న కొందరు గమనించి అత్యవసర వాహనంలో ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు. దీనిపై బాధితుడి భార్య వజ్రకరూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## బాలుడిపై పోక్సో కేసు

**విడపనకల్లు (ఉరవకొండ), న్యూస్‌టుడే :** విడపనకల్లుకు చెందిన బాలునిపై (14) స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. గత నెల 15న అదే గ్రామానికి చెందిన 9 ఏళ్ల బాలికపై ఆ బాలుడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లి బాలున్ని ప్రశ్నించగా, బాలుని తల్లి, బంధువులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెప్తే చంపుతామంటూ దౌర్జన్యం చేశారు. ఈ ఘటనపై బాలిక తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారించిన పోలీసులు బాలునిపై పోక్సో కేసు, అతని తల్లి, బంధువులపై వివిధ సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేశారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**విడపనకల్లు (ఉరవకొండ):** కర్ణాటకలోని బళ్లారి తాలుకా రూపనగుడి నుంచి ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక మద్యాన్ని తీసుకొస్తున్న పాల్తూరుకు చెందిన వన్నూరుస్వామిని, బొమ్మనహాళ్ మండలం గోవిందవాడ వాసి అనిల్‌కుమార్‌ను అరెస్టు చేసినట్లు ఉరవకొండ ఎక్సైజ్ సీఐ రవిచంద్ర మంగళవారం తెలిపారు. సోమవారం రాత్రి అనంతపురం ఎన్‌ఫోర్స్‌మెంటు ఇన్‌స్పెక్టర్ సుహాసిని, ఉరవకొండ ఎక్సైజ్ ఎస్ఐ వీరస్వామి విడపనకల్లు మండలం హావళిగి వద్ద తనిఖీలు చేస్తుండగా వారు వేర్వేరుగా ద్విచక్ర వాహనాల్లో కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 480 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామన్నారు. వారిని కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు చెప్పారు.

## ముళ్లకంపల తొలగింపు

**బ్రహ్మసముద్రం :** మండలంలోని నాగిరెడ్డిపల్లి నుంచి భైరసముద్రం వరకు మూడు కిలోమీటర్లు రహదారికి ఇరువైపులా ముళ్లకంపలు ఏపుగా పెరిగి రోడ్డుమీదకు రావడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. సర్పంచి సందీప్‌కుమార్ పొక్లెయిన్‌తో వాటిని తొలగించారు.

## వరద బాధితులకు విరాళం

**కుందుర్పి, న్యూస్‌టుడే :** కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం.. మండలంలోని సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు (ఎస్‌కే చారిటబుల్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విలువల బడి విద్యార్థులు సేకరించిన విరాళాలు రూ.20 వేలు చెక్కును ట్రస్టు వ్యవస్థాపకుడు, గాయకుడు లెనిన్ బాబు మంగళవారం త్రివేండ్రంలో ముఖ్యమంత్రి పినరయ్ విజయన్‌కు అందజేశాడు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గ్రామాల్లోని విలువల బడి విద్యార్థుల దాతృత్వాన్ని ముఖ్యమంత్రి అభినందించినట్లు లెనిన్ బాబు తెలిపారు.


కేరళ సీఎంకు చెక్కును అందజేత

## నీటిశుద్ధి యంత్రాలకు మరమ్మతులు చేయండి

**రాయదుర్గం :** పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాలు పాడవడంతో తాగునీటి కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటికి మరమ్మతులు చేయించాలని కోరుతూ డిప్యూటీ డీఈఓ శ్రీదేవికి విద్యార్థి సంఘాల నాయకులు బంగి శివ, మాధవ్, కొట్రేష్‌లు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని పలు ప్రైవేటు పాఠశాలలు రేకులషెడ్ల కింద నిర్వహిస్తున్నందున వర్షా కాలంలో గాలి, వర్షాలకు వర్షాలకు షెడ్లు కారటం, కూలే అవకాశం ఉన్నందున వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థులనే ఉపాధ్యాయులుగా నియమించారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## రాయి జారితే ప్రమాదమే..

**కుం**దుర్పి మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాల ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఏర్పాటు చేసిన గేట్లు శిథిలావస్థకు చేరాయి. ఓ వైపున గోడకు అమర్చిన రాళ్లు పడిపోవడంతో గేటు ప్రమాదకరంగా మారింది. దీంతో నిత్యం విద్యార్థులు పాఠశాలకు వెళ్లే క్రమంలో వారిపై రాళ్లు జారిపడే అవకాశం ఉంది. వెంటనే గేట్లకు మరమ్మతులు చేయించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కుందుర్పి**

## 25న ఉద్యోగ మేళా

**రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే :** ఈ నెల 25న కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేళాకు సంబంధించి గోడ పత్రాలు ఆవిష్కరించారు. పదుల సంఖ్యలో కంపెనీలు ఈ మేళాకు హాజరవుతున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉలిగన్న, జానకిరామ్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## 'హంద్రీనీవా అభివృద్ధికి పైసా కేటాయించని వైకాపా'

**ఉరవకొండ, న్యూస్‌టుడే :** హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు 6,300 క్యూసెక్కుల నీటిని తీసుకొస్తామని 2021లో చెప్పి, జీఓ ఇచ్చిన అప్పటి సీఎం జగన్ ఆచరణలో దాన్ని అమలు చేయలేకపోయారని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం హంద్రీనీవా అభివృద్ధికి నయా పైసా కూడా కేటాయించలేదని విమర్శించారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హంద్రీనీవా వెడల్పు చేయడంతో పాటు, పంట కాలువలకు నీరందించే దిశగా అడుగులు వేయడం స్వాగతనీయమన్నారు. ఆ దిశగా మంత్రి పయ్యావుల కేశవ్ జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం 6300 క్యూసెక్కుల నీటినైనా తీసుకొచ్చేలా వెడల్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బాలరంగయ్య, శ్రీనివాసులు, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, నాయకులు మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ దారిలో నడిచేదెలా..?

**ఉ**రవకొండలోని శివరామిరెడ్డి కాలనీలో మొదటి వీధిలో దారి మొత్తం గుంతలు పడి, బురదగా మారింది. అదే దారిలో అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు వృద్ధాశ్రమం ఉంది. చిన్నారులు ఆ కేంద్రాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడినప్పుడల్లా 15రోజులపాటు నడవడానికి, వాహనాలు తిరగడానికి కష్టంగా ఉంటోంది. ఆ దారికి మరమ్మతులు చేయించాలని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి, దారికి మరమ్మతులు చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. సమస్యను పంచాయతీ కార్యదర్శి గోస్‌సాహెబ్ దృష్టికి తీసుకెళ్లగా ఆ దారికి మరమ్మతులు చేయించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.
**- న్యూస్‌టుడే, ఉరవకొండ**



# గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

## పంట నష్ట పరిహారంపై ఆరా

**గుంతకల్లు గ్రామీణం:** నెలగొండ గ్రామంలో 2024 ఖరీఫ్‌లో అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు అందాల్సిన పరిహారంలో అన్యాయం జరిగిందని ఈనెల 19న ఈనాడు కథనం రావడంతో అధికారులు స్పందించారు. వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ జీవీ శివప్రసాద్ గ్రామంలో పర్యటించి రైతులతో కలిసి విచారణ జరిపారు. పంట నష్టం 30 శాతం లోపు ఉండటంతో పరిహారం అందించలేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. విచారణ నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. జేడీఏ పద్మజ, మండల వ్యవసాయాధికారిణి కె.స్వాతి, ఆర్బీకే సహాయకుడు బోలికొండ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### మృతురాలి ఆచూకీ లభ్యం

**గుత్తి, న్యూస్‌టుడే:** గుత్తి రైల్వే జంక్షన్‌లో నాలుగు రోజుల కిందట రైల్లో ప్రయాణిస్తూ గుండెపోటుతో మరణించిన మహిళ ఆచూకీ లభించింది. కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన షహనాజ్‌గా రైల్వే పోలీసులు మంగళవారం గుర్తించారు. ఆమె రాయచూరులో దిగాల్సి ఉంది. గుండెపోటుతో రైల్లోనే మృతి చెందగా సహ ప్రయాణికులు గుత్తిలో గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేపట్టారు.

### చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

**గుంతకల్లు పట్టణం:** పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన కేసుల్లో ఇద్దర్ని రెండో పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి ఆరు తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండిని స్వాధీనం చేసుకున్నామని సీఐ ఏబీ మస్తాన్ తెలిపారు. మంగళవారం గుంతకల్లు పట్టణంలో రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సాయంత్రం సీఐ వివరాలు వెల్లడించారు. గుంతకల్లు పట్టణంలో షిరిడీ కాలనీకి చెందిన సుంక అలియాస్ పప్పు, గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన జగదీష్‌ను దొంగలుగా గుర్తించారు.

### ఆటోకు నిప్పు పెట్టిన దుండగులు

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** మండలంలోని బూదేడుకు చెందిన కృష్ణమూర్తి ఆటోకు మంగళవారం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటి ముందు నిలిపిన ఆటోను తెల్లవారుజామున లేచి చూసేసరికి కాలిపోయింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై గౌస్‌బాషాతో పాటు సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. ప్రమాదంలో రూ.3లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

### ఐదు ఇసుక ట్రాక్టర్ల జప్తు

**పామిడి, న్యూస్‌టుడే:** పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను జప్తు చేసినట్లు సీఐ యుగంధర్ చెప్పారు. మంగళవారం అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### టిప్పర్ల పట్టివేత

**గార్లదిన్నె:** పామిడి నుంచి కల్లూరు వైపు మట్టి లోడుతో వెళ్తున్న టిప్పర్లను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని జప్తు చేసినట్లు ఆయన తెలిపారు.

### జూదరుల అరెస్టు

**శింగనమల:** మరువకొమ్మ సమీపంలో జూదం ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్టు చేసినట్లు సీఐ కౌలుట్లయ్య తెలిపారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 6,170లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

## పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రి పురపాలికలో పని చేసే ప్రతి పారిశుద్ధ్య కార్మికులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు దుస్తులు, మాస్కులు, బూట్లు తదితర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కార్మికులకు ఎలాంటి భద్రత కల్పించలేదని, కూటమి ప్రభుత్వం రాగానే పారిశుద్ధ్య, భూగర్భ మురుగునీటి కార్మికులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు దుస్తులు అందజేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి

## మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

**సమస్య:** కసాపురంలోని రామాలయం సమీపంలో మురుగు కాలువలు అధ్వానంగా మారాయి. - **రాము గ్రామస్థుడు**

**సమాధానం:** మురుగు తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. - **సురేష్, పంచాయతీ కార్యదర్శి** - న్యూస్‌టుడే, గుంతకల్లు గ్రామీణం

**సమస్య:** గుంతకల్లులోని 60 అడుగుల రోడ్డు శ్రీకృష్ణదేవరాయల విగ్రహం దగ్గరలో బ్యాంకు కాలనీలో చెత్తసేకరణ జరగడం లేదు. - **బాలయ్య, విశ్రాంత ప్రిన్సిపల్**

**సమాధానం:** సమస్యను పరిష్కరిస్తాం. - **ఇంద్రసేనరెడ్డి, ఆర్పీ, 14వ సచివాలయం** - న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

## పొదుపు సంఘం..

పురపాలిక: గుంతకల్లు
పొదుపు సంఘాలు: 2,200
సభ్యులు: 22 వేలు

- స్వయం ఉపాధి దిశగా మహిళలు
- పిల్లలకు ఉన్నత చదువులు
- ఆర్థికంగా బలపడుతున్న సభ్యులు

# ప్రగతి మంత్రం

రూ.25 లక్షల రుణానికి అర్హత



సమావేశమైన పొదుపు సంఘం సభ్యులు

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** గుంతకల్లులోని స్నేహ మహిళా సమాఖ్యలోని శ్రీలక్ష్మి మహిళా పొదుపు సంఘాన్ని మహిళలు ఉన్నతంగా నిర్వహిస్తున్నారు. వీరంతా సంఘం సభ్యులు తిలక్‌నగర్‌కు చెందినవారు. పురపాలికలో మొత్తం 2,200 సంఘాలు, 22 వేల మంది సభ్యులు ఉన్నారు. ప్రతి సంఘంలో పది మంది సభ్యులుగా ఉంటున్నారు. శ్రీలక్ష్మి సంఘాన్ని 18 ఏళ్ల కిందట ఏర్పాటు చేసుకున్నారు. సభ్యులందరూ ఎలాంటి విభేదాలు లేకుండా అందరూ ఇప్పటికీ సఖ్యతతో ఉంటున్నారు. సభ్యుల్లో టైలరింగ్, బంగాళదుంపల చిప్స్ తయారీ, జనరల్ స్టోర్స్, గార్మెంట్స్ తదితర స్వయం ఉపాధి మార్గాలతో రాణిస్తున్నారు. రుణాలు సక్రమంగా చెల్లించడం ద్వారా మరో రూ.25 లక్షలు తీసుకునేందుకు అర్హత సాధించారు. పొదుపు చేసే డబ్బును కష్టాల్లో ఉన్న సభ్యులకే కాకుండా వరద బాధితులు, పోలీసుల సంక్షేమానికి విరాళాలు అందజేశారు. పొదుపు సంఘం మూలంగా పేదరికం నుంచి బయటపడుతున్నారు.

### అందరి మధ్య సఖ్యత

సంఘం ప్రారంభంలో ఎవరున్నారో ఇప్పటికీ వారే కొనసాగుతుండటం విశేషం. దీన్ని బట్టి సభ్యుల మధ్య ఏస్థాయిలో సఖ్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరంతా ఒక మాటపై నిలబడి బ్యాంకు నుంచి రూ.12 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు.



### కుమార్తెలకు ఉన్నత చదువులు

- చంద్రకళ, అధ్యక్షురాలు, శ్రీలక్ష్మి మహిళా పొదుపు సంఘం

పొదుపు సంఘం చేసిన తర్వాతే జీవితాలు బాగుపడ్డాయి. పొదుపు సంఘంలో రుణం తీసుకొని కుట్టు మిషన్లు పెట్టుకొని జీవనం సాగిస్తున్నా. నాతోపాటు మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నా. తద్వారా వచ్చే ఆదాయంతో కుమార్తెలిద్దర్ని బీటెక్, ఎంబీఏ చదివిస్తున్నా. కుటుంబ అవసరాలకు, వృద్ధికి నా సంపాదన తోడవుతోంది. నాతోపాటు సభ్యులంతా జనరల్ స్టోర్స్, చిప్స్ తయారీ, గార్మెంట్స్ వంటి వాటితో ఉపాధి పొందుతూ ఆర్థికంగా పుంజుకున్నారు.



## ప్రతిభకు పదును

'**ఈ**నాడు' ఆధ్వర్యంలో తాడిపత్రిలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు- విద్యార్థులపై ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన అఖిల, మధురిమ, పలనీలకు ఆదర్శపాఠశాల ప్రిన్సిపల్ లావణ్య బహుమతులు ప్రదానం చేశారు. **- న్యూస్‌టుడే, తాడిపత్రి**



## యథేచ్ఛగా ఆక్రమణల పర్వం



మోదినాబాదులో రోడ్డును ఆక్రమించి సాగిస్తున్న నిర్మాణం

**గుంతకల్లు, యాడికి, న్యూస్‌టుడే:** పట్టణంలోని రైల్వే కాలనీ, మోదినాబాదుకు మధ్య ఉన్న రహదారి ముందే ఇరుకైంది. కావడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించడానికి, ఆటోల్లో వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. కొందరు దర్జాగా రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా రోడ్డు సందుగా మారింది. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు మౌనంగా ఉండటం అన్యాయమని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. అధికారులు రోడ్డు సర్వే చేసి ఆక్రమ నిర్మాణాలను తొలగించి వెడల్పు చేయాలని వారు కోరుతున్నారు. దీనిపై ఏసీపీ శ్రీనివాసులు వివరణ కోరగా రోడ్డును పరిశీలించి పనులు ఆక్రమమని తేలితే తొలగిస్తామని వివరించారు.

### ఆసుపత్రి గోడనూ వదల్లేదు

యాడికి ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీని కొందరు రోజురోజుకీ ధ్వంసం చేస్తూ కబ్జాకు పాల్పడుతున్నారు. ఆసుపత్రి పక్కన ఉన్న కాలనీకి చెందిన కొందరు తమ నివాసాలకు వెళ్లడానికి ప్రహరీని కూలుస్తూ ఆక్రమిస్తున్నారు. సాయంత్రం సమయాల్లో నిర్మానుష్యంగా ఉండటంతో కొందరు ఆకతాయిలు లోపలికి ప్రవేశిస్తున్నారు. మందు బాబులు ఈ ప్రాంగణాన్ని తమకు అడ్డాగా మార్చుకున్నారు. మరి కొందరు గోడను ధ్వంసం చేసి పక్కా నిర్మాణాలు చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.



ప్రహరీని కూల్చి కట్టడాలు

## రహదారి పనుల్లో అవినీతి



మిడుతూరు వద్ద మరమ్మతులకు నోచుకోని రహదారి

**పెద్దవడుగూరు, న్యూస్‌టుడే:** మండలంలోని మిడుతూరు నుంచి కోట కొండ వరకు ఉన్న ఆర్ అండ్‌బీ రహదారి పనులకు గత వైకాపా ప్రభుత్వం మరమ్మతుల నిమిత్తం రూ.కోటి మంజూరు చేయగా పనులు దక్కించుకున్న గుత్తేదారులు నాసిరకం పనులు చేశారు. దెబ్బతిన్న ప్రదేశాల్లో మరమ్మతులు చేయాల్సి ఉండగా అక్కడక్కడ మాత్రమే పనులు చేశారు. గుంతల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ఎవరికీ పట్టడం లేదు. దీనిపై ఆర్అండ్‌బీ ఇంజినీర్ నరసయ్యను వివరణ కోరగా మంజూరైన నిధులు ఇంకా మిగిలి ఉన్నందున గుంతలు పడిన ప్రాంతాల్లో మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

## అమరవీరుల సేవలు చిరస్మరణీయం

**పెద్దవడుగూరు, న్యూస్‌టుడే:** దేశసేవలో పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్సై ఆంజనేయులు పేర్కొన్నారు. అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పెద్దవడుగూరు మండలంలోని కొత్తపల్లిలో మంగళవారం అమరవీరుల త్యాగాలను ఆయనతోపాటు సిబ్బంది గుర్తుచేసుకున్నారు. మండలానికి చెందిన కొందరు బీఎస్‌ఎఫ్ జవాన్లు దేశసరిహద్దుల్లో పహరా కాస్తున్న సమయంలో మిలిటెంట్ల దాడిలో మరణించారని, అందులో కొత్తపల్లికి చెందిన దేవన సుధాకరరెడ్డి, పెద్దవడుగూరుకు చెందిన కుమ్మెత సుదర్శనరెడ్డి ఉన్నారన్నారు. అనంతరం జవాను కుటుంబాలను ఎస్సై ఆంజనేయులుతోపాటు జమేదారు మనోహర, మోహన్ పరామర్శించారు. అనంతరం వారి స్తూపాలకు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



జవాను విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎస్సై తదితరులు

## 'గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకో'

**శింగనమల, న్యూస్‌టుడే:** నవ్యాంధ్ర నిర్మాత నారా చంద్రబాబునాయుడుపై మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన వ్యాఖ్యలపై మంగళవారం శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మండిపడ్డారు. పదవి కోల్పోయిన గోరంట్ల మాధవ్‌కు పిచ్చిపట్టిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బాలకృష్ణలను విమర్శించే స్థాయి ఆయనకు లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం వారు శ్రమిస్తున్నారన్నారు. మాధవ్ చేసిన అవినీతి, అరాచకాల వల్లే వైకాపాలో టికెట్ కూడా దక్కలేదని దుయ్యబట్టారు.

### పోలీసుల అదుపులో నిందితుడు

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రి మండలంలోని చుక్కలూరు క్రాస్ సమీపంలో నాటుసారా అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గడ్డం నాయుడు తెలిపారు. గుంతకల్లు మండలం గుండాల గ్రామానికి చెందిన శ్రీరాములు చుక్కలూరు క్రాస్ వద్ద ఉన్న నాపరాళ్ల పరిశ్రమలో పనిచేస్తున్నాడని, అయితే కొద్ది రోజుల నుంచి నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేయగా 73 నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

### మూర్ఛతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

**గుత్తి, న్యూస్‌టుడే:** గుత్తిలోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం ఈసీఈ చదువుతున్న ధనుంజయ మూర్ఛవ్యాధితో మరణించాడు. యాడికి గ్రామానికి చెందిన అతడు మంగళవారం ఉదయం కళాశాలకు వెళ్లాడు. తనకు ఆరోగ్యం బాగలేదని అధ్యాపకులకు చెప్పి గ్రామానికి వెళ్లేందుకు కళాశాల గేట్ వద్దకు వెళ్లగానే కుప్పకూలిపోయాడు. మూర్ఛవ్యాధి రావడంతో కళాశాల యాజమాన్యం వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యంలోనే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చేతికొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

### గోవు అపహరణ

**గుంతకల్లు గ్రామీణం:** పట్టణంలోని కసాపురం రోడ్డులో నివాసముంటున్న ధనుంజయ ఇంటి వద్ద ఉన్న దొంగలు గోవును అపహరించినట్లు కసాపురం పోలీసులకు బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలోనూ రెండు గోవులు దుండగులు ఎత్తుకెళ్లారని వాపోయారు.

## విజ్ఞాన వికాసం





'**ఈ**నాడు' ఆధ్వర్యంలో గుంతకల్లులోని డాక్టర్ సరోజినీ నాయుడు పురపాలిక బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంతర్జాలంతో కలిగే లాభనష్టాలు, సామాజిక మాధ్యమాలు- విద్యార్థులపై ప్రభావం అనే అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన జునైనా అజీజా, శ్రావణి, హతియా తబుసుమ్‌లకు ప్రధానోపాధ్యాయిని సాహెరాబాను బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు శ్రీలత, మంజువాణి, తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు**

## మట్కాను సమూలంగా కట్టడి చేస్తాం



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ సాయిప్రసాద్

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** తాడిపత్రి పట్టణంలోని పలు ప్రాంతాల్లో మట్కాను సమూలంగా కట్టడి చేస్తామని సీఐ సాయిప్రసాద్ హెచ్చరించారు. మంగళవారం స్థానికుల సమాచారంతో సీఐ సాయిప్రసాద్ సిబ్బంది కలిసి మట్కా నిర్వహణ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఇందులో గాంధీకట్ట, అంబేడ్కర్‌నగర్, శివాలయం వీధి తదితర పలు కాలనీల్లో మట్కా నిర్వహిస్తున్న 14 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆరీఫ్‌బాషా, చంద్రశేఖర్, సాధిక్, వరుణ్‌కుమార్, షేక్షావలి, మహమ్మద్ మగ్దూం, బాలనారాయణ, మహబూబ్, షాహిదా, మన్సూర్, జ్యోతి, వన్నూర్, నౌషద్, కుళ్లాయప్పలను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.2,19,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎక్కడైనా మట్కాతో పాటు పలు జూదాలకు పాల్పడినా, గంజాయి వంటివి అమ్మినా, కొన్నా చర్యలు కఠినంగా ఉంటాయని సీఐ హెచ్చరించారు.

## విద్యార్థులకు వైద్యురాలి చేయూత



వైద్యురాలు సరోజమ్మను సత్కరిస్తున్న కళాశాల సిబ్బంది

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** స్థానిక ఎస్‌ఏపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న అమ్మాయిలను ఆదుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ వైద్యురాలు, పూర్వ విద్యార్థిని సరోజమ్మ అన్నారు. కళాశాలకు ప్రభుత్వం వసతిగృహాన్ని మంజూరు చేసింది. దీన్ని ప్రభుత్వం ప్రారంభించే వరకు విద్యార్థులను ఆదుకోవడానికి కళాశాల అధికారులు తాత్కాలిక సౌకర్యాలు కల్పించారు. దీనికి గాను సరోజమ్మ రూ.లక్ష సాయం అందించారు. ఆమె సేవలను గుర్తించి సత్కరించారు. అనంతరం ఆమె తాత్కాలిక వసతి గృహాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఎదురైతే తాము ఉచితంగా వైద్యాన్ని అందిస్తామని ప్రకటించారు. ప్రధానాచార్యుడు లక్ష్మయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## తాడిపత్రి అభివృద్ధికి కృషి చేద్దాం

**తాడిపత్రి, న్యూస్‌టుడే:** సచివాలయ ఉద్యోగులను సరిగా వినియోగించుకుంటే తాడిపత్రి మున్సిపాలిటీని కాకుండా రాష్ట్రమే అభివృద్ధి బాట పడుతుందని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో సచివాల ఉద్యోగులను నాయకుల అక్రమాలకు, ఓటుకు డబ్బులు పంచేందుకు మాత్రమే వినియోగించారని ఆరోపించారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల సేవలు ఎలా వినియోగించాలో చేసి చూపిస్తామని జేసీ పేర్కొన్నారు. వైకాపా హయాంలో తాను సచివాలయ ఉద్యోగులతో సమావేశం పెట్టాలని తెలిపితే అప్పటి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఉద్యోగులను బయపెట్టారన్నారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతోనే పురపాలిక అభివృద్ధి సాధిస్తామన్నారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ప్రజలకు ప్రశాంతంగా సమాధానం ఇవ్వాలన్నారు. తాడిపత్రి పురపాలిక అభివృద్ధికి ప్రభుత్వ నుంచి నిధులు తెచ్చే బాధ్యత తనదేనన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, పలువురు తెదేపా నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

## పంటలు వర్షార్పణం

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** పంట చేతి కందే సమయంలో సోమవారం రాత్రి కురిసిన భారీ ఈదురు గాలులు, వర్షాలకు వరిపంట నేలపాలైంది. వరి పంటతో పాటు పత్తి, వేరుసెనగ పంటలు దెబ్బతినడంతో దాదాపు రూ.60 లక్షలు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి సోమశేఖర తెలిపారు. గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించిన అనంతరం ఉన్నతస్థాయి అధికారులకు మంగళవారం నివేదికలు పంపారు. వరి, పత్తి, వేరుసెనగ 152 ఎకరాల్లో 47 మంది రైతులు నష్టపోయినట్లు ఆయన తెలిపారు.



మర్తాడులో నేలకొరిగిన వరిపైరు

## ప్రమాదాల నివారణపై అవగాహన

**గార్లదిన్నె, న్యూస్‌టుడే:** గార్లదిన్నె నుంచి కల్లూరు వరకు 44వ జాతీయ రహదారిపై కొన్ని ప్రదేశాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో ప్రమాదాల నివారణ కోసం మంగళవారం జాతీయ రహదారుల సిబ్బంది భరత్, ఎస్సై గౌస్‌బాషా పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేగనిరోధకాల వద్ద ప్రమాదాల సూచికల ఏర్పాటు పలు అంశాలపై ఎస్సై చర్చించారు. కల్లూరు వద్ద తరిమెల క్రాస్, తలగాసిపల్లి, ట్రాన్స్‌కో కార్యాలయ సమీపంలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటి నివారణ కోసం చర్యలు చేపట్టనున్నట్లు ఎస్సై తెలిపారు.


## ఐదేళ్లుగా ఎదురుచూపులు

**గ**త వైకాపా పాలకుల నిర్లక్ష్యం పెద్దపప్పూరు మండల ప్రజలకు శాపంగా మారింది. ఐదేళ్లుగా సీసీ రహదారులు నిర్మాణానికి నోచుకోక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2018లో తెదేపా ప్రభుత్వం మండలకేంద్రానికి రూ.2 కోట్లు కేటాయించి భూగర్భమురుగునీటి వ్యవస్థ పనులను ప్రారంభించింది. రూ.1.60 లక్షలతో పైపులు, మ్యాన్‌హోళ్ల ఏర్పాటు చేసింది. సీసీ రహదారులు నిర్మించే సమయంలో 2019 ఎన్నికలు రావడంతో పనులు నిలిచిపోయాయి. దీనిపై మండల ఇంజినీరు ప్రసన్న కుమార్ స్పందిస్తూ కూటమి ప్రభుత్వం రూ.30 లక్షలతో పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టిందన్నారు. **-న్యూస్‌టుడే, పెద్దపప్పూరు**



## ఆ సోదరులది కొండంత మనసు

**విద్యార్థులకు చదువులకు తోడ్పాటు**



రవి



అశోక్

**గుంతకల్లు, న్యూస్‌టుడే:** గుంతకల్లుకు చెందిన అన్నదమ్ములు విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని పెంచడానికి ఆర్థిక తోడ్పాటు అందించి ప్రోత్సహిస్తున్నారు. తండ్రి ఉపాధ్యాయుడుగా పని చేసిన పాఠశాలకు ఆయన జ్ఞాపకార్థం సోదరులిద్దరూ ఉత్తమ మార్కులు సాధించే విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు.


★ రైల్వే ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మూడేళ్ల కిందట చనిపోయిన వేదాంతాచారి జయంతి సందర్భంగా విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయడానికి ఆయన కుమారులు రవి, అశోక్ కృషి చేస్తున్నారు. వీరిద్దరూ రైల్వే ఉన్నత పాఠశాలలో చదువుకున్నవారే. ఇద్దరూ ఛార్టెడ్ అకౌంటెంట్లుగా స్థిరపడ్డారు. రవి లండన్‌లో అశోక్ ముంబయిలో స్థిరపడ్డారు.

**బ్యాంక్‌లో నిల్వ చేసిన మొత్తంతో..**

రవి రూ. లక్ష విరాళాన్ని రైల్వే పాఠశాలకు మూడేళ్ల కిందట కిందట అందజేశారు. ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేశారు. దీనిపై వచ్చే వడ్డీని పాఠశాలలో 6 నుంచి పదో తరగతిలో ఎవరైతే ఎక్కువ మార్కులు సాధిస్తారో వారికి ఆర్థిక సాయం చేస్తున్నారు. ఇక అశోక్ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించే బాలికకు, బాలుడికి రూ. 50,101 అందజేయాలని నిర్ణయించారు. ఇది వరకు పిల్లల్ని ప్రోత్సహించేందుకు సాయమందించారు. తన తండ్రి పుట్టి 101 ఏళ్లు పూర్తయినందున సేవలను నిరంతరం కొనసాగిస్తామని దాత చెబుతున్నారు.

## చెరువుకు వరద పోటు

**అ**నంతపురం ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో పండమేరు వాగు పొంగి పొర్లుతోంది. అక్కడి నుంచి బుక్కరాయసముద్రం చిక్కవడియార్ చెరువుకు భారీగా వరదనీరు వస్తోంది. గంటగంటకూ చెరువులో నీటి మట్ట పెరుగుతోంది. సోమవారం రాత్రి రాప్తాడు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఎన్నడూలేని విధంగా పండమేరు వాగుకు వరద పోటెత్తింది. గతంలో చిక్కవడియార్ చెరువులో 20 శాతం మాత్రమే నీరు ఉంది. మంగళవారం ఒక్కరోజులోనే చెరువుకు 50 శాతానికి పైగా నీరు వచ్చి చేరింది. చెరువు మరువ పారడానికి మరో 3 అడుగుల మేర నీరు రావాల్సి ఉంది. మరో రెండు రోజులు జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తాయని రేకులకుంట వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయ్‌శంకర్‌బాబు, నారాయణస్వామి తెలిపారు. **-న్యూస్‌టుడే, బుక్కరాయసముద్రం**



# అనంతపురం

•అనంతపురం •రాప్తాడు


## నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

**తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే:** నాలుగేళ్ల ఇంజినీరింగ్ కోర్సు సాదాసీదాగా పూర్తి చేస్తే ఎలాంటి గుర్తింపు ఉండదని, కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ అనంత రాముడు పిలుపునిచ్చారు. మంగళవారం కళాశాలలో ప్రాజెక్టు ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల ప్రదర్శనలను తిలకించి ఇంజినీరింగ్ విద్యార్థులతో మాట్లాడారు. కొత్త ఆలోచనలకు అనుగుణంగా ఆవిష్కరణలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల వైస్‌ఛైర్మన్ రమేశ్‌నాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వినూత్నంగా ఆలోచిస్తే పరిశోధనలకు ప్రాణం పోయవచ్చన్నారు. అనంతరం ఉత్తమ ప్రాజెక్టులు ప్రదర్శించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామమూర్తి, డీన్‌లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## దుల్హన్ పథకం అమలుకు వినతి

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** గత తెదేపా హయాంలో దుల్హన్ పథకాన్ని తిరిగి ప్రారంభించి అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ మైనార్టీ వింగ్ ఇన్‌ఛార్జ్ నగర ప్రధాన కార్యదర్శి బాజా హుస్సేన్, గౌరవాధ్యక్షుడు అల్లీపీరాలు కోరారు. మంగళవారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుందని ఆరోపించారు. గతంలో దుల్హన్ పథకం మైనార్టీలకు ఎంతో ఉపయుక్తంగా ఉండేదన్నారు. మైనార్టీ వసతి గృహాలు, మసీదుల నిర్మాణాలకు నిధులు, ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం, ఆర్థికంగా వెనుకబడిన మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వివిధ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇన్సాఫ్ నాయకులు చాంద్‌బాషా, హాజీవలి తదితరులు పాల్గొన్నారు.


ఉప్పరపల్లి ఇందిరమ్మ కాలనీ నుంచి వరదలో చిక్కుకున్న ఆటోను తోసుకుని వస్తూ


వరద బాధితులను పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్


పంగల్‌రోడ్డు వద్ద సెయింట్ విన్సెంట్ స్కూల్‌లో నిలిచిన వరద నీరు..

## చిగురుటాకులా నగరం వణికె..

వర్షం దాటికి నగరం అల్లకల్లోలం అయ్యింది. ముఖ్యంగా వీధులను ముంచెత్తింది. వంకలు పోటెత్తి నగర శివారు కాలనీల్లో నీరు ఇళ్లలోకి చేరింది. రోడ్లు ధ్వంసం అయ్యాయి. - **ఈనాడు, అనంతపురం**


జగనన్న కాలనీ వరద ముంపులో చిక్కుకుని మిద్దెలెక్కి సహాయం కోసం ఎదురుచూస్తున్న బాధితులు


44వ జాతీయ రహదారిపై గుట్టూరు కూడలిలో నిలిచిన వాహనాలు

## చట్టాలపై అవగాహన అవసరం

**ఆత్మకూరు:** గిరిజన ప్రాంతాలకు చెందిన ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని దేవునికుంట తండాలో మంగళవారం న్యాయసేవలపై అవగాహన కల్పించారు. గిరిజన ప్రాంత ప్రజలు కేసులు ఉండి ఆర్థిక స్థోమత లేకపోతే ప్రభుత్వం నుంచి న్యాయవాదులను ఏర్పాటు చేస్తామన్నారు.


మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్

## చేతివృత్తిదారులను ఆదుకోవాలని వినతి

**అశోక్‌నగర్, అనంత సంక్షేమం, న్యూస్‌టుడే:** సంక్షేమ శాఖ ద్వారా చేతి వృత్తిదారులను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి.లింగమయ్య డిమాండ్ చేశారు. మంగళవారం చేతివృత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతపురం బీసీ కార్పొరేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లాలో 30 శాతం వృత్తిదారులు ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఆయా సంక్షేమ శాఖల ద్వారా రుణాలిచ్చి ఆదుకోవాలన్నారు.

## మధ్యంతర భృతి ప్రకటించండి

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించేలా రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయం తీసుకోవాలని గిరిజన ఉపాధ్యాయసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుజ్జల శివయ్య, రవీంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఆర్సీ కమిటీ వ్యవస్థీకరించాలని, సీపీఎస్ రద్దు, బకాయిలు ఉన్న డీఏ తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు.

## వైకాపా పాలనలో మహిళలకు రక్షణ కరవు

**రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** గత ఐదేళ్ల వైకాపా హయాంలో మహిళలు అరాచకాలు, చిత్రహింసలకు గురయ్యారని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు ఆరోపించారు. మంగళవారం అనంతపురం నగరం రహదారులు, భవనాల శాఖ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామానికో సైకోను తయారు చేశారన్నారు. శాంతిభద్రతలపై వైకాపా నాయకులు మాట్లాడటంపై ఘాటుగా స్పందించారు. వారి ప్రభుత్వంలో మహిళలపై ఆ పార్టీ నాయకులు అఘాత్యాలకు పాల్పడినప్పుడు శాంతిభద్రతలు గుర్తుకు రాలేదా అంటూ మండిపడ్డారు. తాడేపల్లిలోని జగన్మోహన్‌రెడ్డి నివాసానికి కూతవేట దూరంలోని సీతారామాపురలో భర్త ఎదుట భార్యను వైకాపా ముకలు హత్యాచారం చేస్తే కనీసం ప్రశ్నించలేదన్నారు. దిశ లేని చట్టాన్ని తీసుకొచ్చి కేవలం హంగులు, ఆర్భాటాలు చేశారే తప్పా మహిళలకు రక్షణ కల్పించలేదని విమర్శించారు. మంత్రి హోదాలో ఉండి అప్పట్లో ఒకటి, రెండు హత్యాచారాలను రాద్ధాంతం చేస్తారని మాట్లాడిన మాజీ మంత్రి రోజా మహిళలపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

## ప్రవేశాల సంఖ్య పెంచాలి

**ఎస్కేయూ:** రాష్ట్ర ప్రభుత్వ సార్వత్రిక విద్య అధ్యయన కేంద్రాల్లో ప్రవేశాలు పెంచాలని పరీక్షల విభాగం సహాయ సంచాలకులు గోవిందనాయక్ పేర్కొన్నారు. మంగళవారం పొట్టి శ్రీరాములు నగరపాలకోన్నత పాఠశాలలో సార్వత్రిక అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈనెల 31 వరకూ ప్రవేశాలకు గడువుందన్నారు. ఇప్పటివరకూ 2,300 మంది ప్రవేశాలు పొందారని, ఈ సంఖ్యను రెండింతలకు పెంచాలన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించండి

**ఎస్కేయూ:** ఉపాధ్యాయుల సమస్యలను మంత్రి మండలి సమావేశంలో చర్చించాలని ఏపీటీఎఫ్ జిల్లాధ్యక్షుడు వెంకటేశ్ పేర్కొన్నారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. . మధ్యంతరభృతి, పీఆర్సీ, సీపీఎస్, 117 జీవో రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలనే అంశాలను అజెండాలో చేర్చాలన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** అనంతపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషను అధికారులు, సిబ్బంది ఆత్మకూరు మండలంలో మంగళవారం జరిపిన దాడుల్లో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పి.యాలేరుకు చెందిన పొన్నపాటి మనోహర్‌రెడ్డి ఇంటి వద్ద ఖాళీ ప్రదేశంలో కర్ణాటక మద్యం నిల్వ చేశాడనే సమాచారం అందుకున్న పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో 24 పెట్టెల్లో 2,304 టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

## అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

**రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే:** అనంత నగరంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కాలనీలు జలమయమయ్యాయి. కాలనీల్లోకి భారీగా నీరు చేరడంతో ప్రజలంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పండమేరు వంక ఉద్ధృతంగా ప్రవహించడంతో అనంతపురం గ్రామీణం పంచాయతీలోని రామకృష్ణ, నారాలోకేశ్, సుశీలారెడ్డి, తిమ్మానాయుడు, అభ్యుదయ కాలనీల్లోకి భారీగా నీరు చేరింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులను అప్రమత్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచే సహాయక చర్యలు చేపట్టారు. వరద బాధితుల కోసం జేఎన్‌టీయూలోని ఎలక్ట్రిసిటి బోర్డు గెస్ట్ హౌస్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇళ్లలోకి నీరు చేరడంతో నష్టపోయామని కాలనీల వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరూ అధైర్యపడొద్దని, ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందజేశారు. సచివాలయ ఉద్యోగులు కాలనీల్లో ఉంటారని, ఏదైనా అవసరం వస్తే వెంటనే చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం అనంతపురం అర్బన్ క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ పంచాయతీ రాజ్, గృహ నిర్మాణశాఖ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనంతపురం గ్రామీణంలోని నాలుగు పంచాయతీల్లో ప్రజలకు సౌకర్యాలు, పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

### సహాయక చర్యల్లో తెదేపా శ్రేణులు

అనంత నగరంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విజయవాడ కేంద్ర కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్‌లో ఉన్న తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌చౌదరి స్పందించారు. తెదేపా అర్బన్ నాయకులు, కార్యకర్తలు సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపు ఇవ్వడంతో మాజీ ఉప మేయర్ సాకే గంపన్న, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బంగినాగ ఆధ్వర్యంలో ప్రసన్నాయపల్లి, చిన్మయనగర్, రామకృష్ణకాలనీ, టీవీ టవర్, నారాలోకేశ్ కాలనీల్లోని విద్యుత్తు తీగలు తెగి సరఫరా ఆగిపోవడంతో సొంత ఖర్చులతో మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు. ముంపునకు గురైన కాలనీల్లో భోజనం పొట్లాలు, తాగునీరు అందజేశారు.


రామకృష్ణకాలనీలో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, అధికారులు

### బాధిత కుటుంబానికి భరోసా

నగరంలోని గుల్జార్‌పేటకు చెందిన షేక్ తుమ్మలకుంట మతీన్ రహదారి ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆ కుంబానికి అండగా నిలిచారు. మంగళవారం తన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేలు నగదు అందజేశారు. బీమా సొమ్ము రావాల్సి ఉందని కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బీమా వచ్చేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నాయకులు ముస్తాక్, సికిందర్ పాల్గొన్నారు.

### మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

**సమస్య:** నగరంలోని జీసస్‌నగర్‌లో వర్షానికి చెట్టు రహదారికి అడ్డంగా పడింది. **- ప్రదీప్‌కుమార్**

**సమాధానం:** వెంటనే తొలగిస్తాం.

**సమస్య:** రాణినగర్ పెద్దమ్మగుడి వద్ద వీధిదీపాలు వెలగడం లేదు **- వెంకటేశ్**

**సమాధానం:** వెంటనే చర్యలు చేపడతాం.

**పై ప్రశ్నలకు నగరపాలక ఉద్యానాధికారిణి లక్ష్మీప్రసన్న, డీఈ దాక్షాయిణి సమాధానాలిచ్చారు.** – న్యూస్‌టుడే, అశోక్‌నగర్

## నీటి సంరక్షణకు గుర్తింపు

**లక్ష్మీనగర్ :** హంపాపురం పంచాయతీలో వాటర్‌షెడ్ పథకం కింద వివిధ రకాల పనులు చేపట్టటంతో భూగర్భ జలాలు పెంపొందించినందుకు చేసిన కృషికి గుర్తింపుగా దిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్ నుంచి జల సంరక్షణ అవార్డును అందుకుంటున్న ఏపీడీ సుధాకర్‌రెడ్డి, సర్పంచి లక్ష్మీదేవి



### తెరపై ఈనాడు

**అనంతపురం (కమలానగర్), న్యూస్‌టుడే : గంగ :** వీక్షణం, **గాయత్రి :** మార్టిన్, **గౌతమి :** జనక అయితే గనక, **గౌరి, ఎస్వీ సినిమాక్స్:** దేవర, **తరంగిణి :** విశ్వం, **తేజస్విని :** లవ్‌రెడ్డి, **త్రివేణి, నీలిమ:** వేట్టయాన్, **సుధా :** ఇద్దరు.






## వ్యాసరచన పోటీలతో చక్కని శైలి

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** వ్యాసరచన పోటీల్లో పాల్గొనడం వల్ల విద్యార్థుల్లో చక్కని రచనాశైలి అలవడుతుందని ప్రసాద్ ఆంగ్లమాధ్యమ పాఠశాల డైరెక్టర్ ప్రసాద్ పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో మంగళవారం అనంత నగరం మూడోరోడ్డులోని ప్రసాద్ ఆంగ్లమాధ్యమ పాఠశాలలో ప్రతిభా పాటవ పోటీలు జరిగాయి. అంతర్జాల వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతి పదో తరగతి విద్యార్థులు సాయిమారుతి, సత్యనారాయణ, ద్వితీయ బహుమతి 9వ తరగతి విద్యార్థిని వైష్ణవికృతి, తృతీయ బహుమతి 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌రెడ్డి దక్కించుకున్నారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్లు నాగరాజుగుప్తా, ప్రసాద్, గంగాధర్ బహుమతులు ప్రదానం చేశారు.

## నేలకొరిగిన భారీ వృక్షం

**ఎస్కేయూ, న్యూస్‌టుడే:** అనంత నగరంలో సోమవారం అర్ధరాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి రామచంద్రనగర్‌లో భారీవృక్షం నేలకొరిగింది. రైల్వేస్టేషన్ సమీపంలోని వినాయక ఆలయ సమీపంలో వృక్షం నేలకొరిగింది. విద్యుత్తు తీగలపై పడటంతో స్తంభం విరిగిపోయింది. దీంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సిబ్బంది చెట్టును తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.



## ఆరోపణలు చేస్తే సహించం

**కమలానగర్, న్యూస్‌టుడే:** అనంతపురం జిల్లాలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అందరికీ అందుబాటులో ఉన్నారని ఆయనపై ఆరోపణలు చేస్తే సహించేది లేదని తెదేపా, జనసేన నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం అనంతపురంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నేతలు తలారి మంజునాథ్, ఈశ్వర్, సైపుద్దీన్ మాట్లాడుతూ.. నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం పార్లమెంటు సమావేశాల్లో తప్ప మిగతా అన్ని రోజుల్లో అనంత ప్రజలకు ఎంపీ అందుబాటులో ఉంటూ ఎంపీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటే అందుబాటులో లేరంటూ ఆరోపించడం తగదన్నారు.

## ప్రమాదమని తెలిసినా.. పట్టింపేదీ?

అనంతపురం నగరపాలక కార్యాలయం నిర్మాణం చేపట్టి 70 ఏళ్లు అవుతోంది. భవనమంతా రాతితో కట్టినా.. సన్‌షేడ్లు, పైభాగం అప్పట్లో చేపట్టిన నిర్మాణం కావడంతో కారుతోంది. ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ, ఈఈ, డీఈలు ఉండే కార్యాలయాల ముందు భాగాన సన్‌షేడ్ ఇటీవల కురిసిన వర్షానికి దెబ్బతిని కూలడానికి సిద్ధంగా ఉంది. మేయర్ ఛాంబర్ పూర్తిగా దెబ్బతిని పెచ్చులూడి పడటంతో ఆయన అదనపు కమిషనరు వినియోగిస్తున్న ఛాంబర్‌ను వాడుతున్నారు. ఉపమేయర్లు ఛాంబర్ల నుంచి పలు సెక్షన్లకు వెళ్లే ప్రధాన మార్గం పెచ్చులూడడంతో పాటు కారుతోంది. - **న్యూస్‌టుడే, అనంత నగరపాలక**



## అంతా బురదమయం

నగరం నుంచి కక్కలపల్లికి వెళ్లే దారిలో టమాటా మండి ప్రాంతం ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఈ దారిలో అనంత నగరం నుంచి కక్కలపల్లి, కాట్నేగానికాలవ, బుక్కచెర్ల తదితర గ్రామాలతో పాటు కనగానపల్లి మండల కేంద్రానికి రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి మొత్తం పెద్దపెద్ద గుంతలు పడటంతో వర్షపునీరు చేరి వాహనాలు వెళ్లడానికి వీలులేకుండా బురదమయంగా మారింది. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - **ఈనాడు, అనంతపురం**



## అసభ్య సందేశాలతో వేధింపులు

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** రెండేళ్ల క్రితం అసభ్యకర సందేశాలతో చరవాణి ద్వారా వివాహితను వేధింపులకు గురిచేస్తున్న ఓ వ్యక్తిపై అనంతపురం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నగరంలోని నాయక్‌నగర్ ఓ భవన సముదాయంలో నివశిస్తున్న బల్లా శ్రీహరి 2022 అక్టోబరులో నగరానికే చెందిన ఓ మహిళ చరవాణికి అసభ్యకరమైన సందేశాలు పంపించేవాడు. ఆమె భయపడి విషయం బయటకు చెప్పక పోవడంతో నిందితుడు మరింత రెచ్చిపోయి వేధింపులకు గురిచేశాడు. నిందితుని భార్య సైతం అసభ్య సందేశాలను స్క్రీన్ షాట్‌లు తీసి వాట్సప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టించారు. వేధింపులు అధికం కావడంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాధితురాలు అమరావతిలోని మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. కమిషన్ ఆదేశాలు, బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడి భార్య హిమబిందు, మరో ఇద్దరిపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

## మనస్తాపంతో ఆత్మహత్య

**అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే:** నగరంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని రాజమ్మనగర్‌కు చెందిన రామంజనేయులు (54) మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య పదేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. అప్పటి నుంచి మానసికంగా కుంగిపోయి వ్యసనాలకు అలవాటు పడ్డాడు. మంగళవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## 'పథకాల అమలు ఎప్పుడో చెప్పండి'

**అశోక్‌నగర్, న్యూస్‌టుడే:** కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని మేయర్ వసీం ప్రశ్నించారు. మంగళవారం జిల్లా వైకాపా కార్యాలయంలో ఆయనతో పాటు కార్పొరేటర్లు సైఫుల్లాబేగ్, నరసింహులు, రహంతుల్లా, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి జిల్లా రైతులను ఆదుకోవాలని కోరితే కూటమి నేతలు విమర్శించడం తగదన్నారు. ప్రతి పక్షంగా ప్రజల పక్షాన మాట్లాడితే సానుకూలంగా తీసుకోకుండా అవాకులు, చవాకులు పలకడం తగదన్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

## స్తంభాల తొలగింపు

**అశోక్‌నగర్, న్యూస్‌టుడే:** నగరంలోని ఆదర్శనగర్‌లో నీటి ట్యాంకు పక్కన ఖాళీ ప్రదేశం శుభ్రం చేసి కొందరు వ్యక్తులు స్తంభాలు ఉంచడంపై నగరపాలక పట్టణ ప్రణాళిక సిబ్బంది స్పందించి తొలగించారు. లేఅవుట్ వేసే సమయంలో ఖాళీ ప్రదేశాలు వదలడంతో అక్కడే పార్కుతో పాటు ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ఇంకా కొంత ఖాళీ స్థలం ఉంది. ఈ స్థలం తమదేనని కొందరు తరచూ చదును చేస్తున్నారు. మంగళవారం చదును చేసిన స్థలంలో ఉంచిన స్తంభాలను తొలగించారు. నగరపాలక స్థలం కావడంతో స్తంభాలను తొలగించామన్నారు. దస్త్రాలుంటే చూపించాలని పట్టణ ప్రణాళికాధికారిణి శిరీష తెలిపారు.

## నరకాన్ని తలపిస్తున్న నగర దారులు

● ప్రతిపాదనలకే పరిమితమైన మరమ్మతులు ● వాహన చోదకులకు తప్పని తిప్పలు


నాయక్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రోడ్డులో గుంత

**న్యూస్‌టుడే: అశోక్‌నగర్**

నగరంలోని రహదారులు నరకాన్ని తలపిస్తున్నాయి. అడుగడుగునా భారీ గుంతలు పడటంతో ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉంటూ రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. వర్షాలకు గుంతలు మరింత పెద్దవిగా మారుతుండటంతో వాహనాల్లో వెళ్లాలంటే వెన్నునొప్పితో పాటు గాయాలపాలవుతున్నామని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైకాపా హయాంలో రహదారుల మరమ్మతులను గాలికొదిలేశారు. కనీసం గుంతలకు గంప మట్టిని కూడా వేసిన దాఖలాలు లేవు.

### అధికారులు మారితే.. సమస్యలు పట్టవా?

నగరపాలకలో అధికారులు బదిలీతో రహదారుల మరమ్మతులు పట్టించుకోలేదు. గతంలో ఉన్న కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు బదిలీ అయ్యారు. నెల రోజుల కిందటే రోడ్ల మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు చేశారు. కొత్తగా కమిషనరు, ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలు వచ్చి 15 నుంచి 20 రోజులు అవుతున్నా కనీసం గతంలో ఉన్న వాటిని పరిశీలించే ఓపిక లేదు. గుంతలు పడిన ప్రాంతాల్లో వెట్‌మిక్స్ వేసి తాత్కాలిక మరమ్మతులు చేద్దామన్న ఆలోచన కూడా లేకపోవడం దారుణం.

● నగరంలోని తిలక్‌రోడ్డు గోతులతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. త్రివేణి వంతెన కూడలి మీదుగా తాడిపత్రి వైపు, ధర్మవరం, గుత్తి, ఆర్టీసీ బస్టాండు వైపు వాహనాలు వెళ్లాల్సి ఉండగా పదుల సంఖ్యలో గుంతలు ఉండటంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. తిలక్ రోడ్డులోని కరీం స్టోర్, కోదండరామాలయం, తపాలా కార్యాలయం, మార్కెట్ సమీపంలోని పూల దుకాణం వద్ద పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి.

● రాంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రుద్రంపేట బైపాస్ వరకు పలు ప్రాంతాల్లో రోడ్డంతా ఛిద్రమైంది. సిద్ధార్థ ఉద్యానవనం కూడలి నుంచి నేరుగా పాత రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లే ప్రాంతం దారుణంగా ఉంది. పీటీసీకి వెళ్లే మార్గంలో పలు ప్రాంతల్లో గోతులున్నాయి.

● విద్యుత్తు నగర్ కూడలి నుంచి నాయక్‌నగర్ చివరి వరకు పలు ప్రాంతాల్లో రోడ్లు భారీగా గుంతలు పడ్డాయి.

● అశోక్ నగర్‌లోని అంబేడ్కర్ భవన్ వద్ద పెద్ద గుంత పడింది. అశోక్‌నగర్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గం మొత్తం గుంతలతో అధ్వానంగా మారింది.


గుంతలమయంగా తపోవనానికి వెళ్లే రహదారి

● ఎన్టీఆర్ మార్గ్‌కు వెళ్లే మలుపు వద్ద, భవాని నగర్ కూడలి రోశయ్య విగ్రహం వద్ద గుంతలు పడ్డాయి.

● గడియార స్తంభం నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఇటీవల తాత్కాలికంగా కొన్ని గోతులు పూడ్చినా పెద్దగా ప్రయోజనం లేదు.

● సోమనాథనగర్ వంతెన నుంచి తపోవనం కూడలి వరకు వందకుపైగానే గోతులు ఉన్నా కనీసం మట్టితో పూడ్చలేదు.

● హౌసింగ్ బోర్డు బస్సు ప్రాంగణం నుంచి లక్ష్మీనరసయ్య కాలనీ వరకు రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో నరకం చవిచూడాల్సి వస్తోంది.

● రాజీవ్ చిల్డ్రన్ పార్కు వెనుకవైపు నుంచి ఎఫ్‌సీఐ, హమాలీ కాలనీలకు వెళ్లే వారికి బురద రోడ్డులో వెళ్లాల్సిందే.

● ప్రధాన రోడ్లే కాదు అంతర్గత రోడ్లలో వెళ్లలేని దయనీయ పరిస్థితి. వేణుగోపాల్ నగర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డు, కమలానగర్‌లో పలు వీధులు, విద్యుత్తు నగర్-1 కాలనీ, ఆదర్శ నగర్, అశోక్ నగర్, రాణినగర్, బిందెల వారి కాలనీ, ఉమానగర్, బోయవీధి, మున్నానగర్, శారదా నగర్, ఎస్‌బీఐ కాలనీ, మారుతి నగర్, రాంనగర్, శ్రీనివాస నగర్, గుల్జార్‌పేట, ఆదిమూర్తి నగర్, అరవింద నగర్, నాయక్ నగర్, జీసస్‌నగర్, విద్యుత్తునగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండటంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

| నగరంలో గుర్తించిన పెద్ద, మోస్తరు గుంతలు | ప్రతిపాదించిన నిధులు | తారు రోడ్లు | సిమెంటు రోడ్లు | రోడ్లు వేయని ప్రాంతం | ఇంజినీర్లు |
|---|---|---|---|---|---|
| 350 | రూ.45 లక్షలు | 62.98 కి.మీ. | 247.67 కి.మీ. | 20.165 కి.మీ. | ఎస్ఈ 1, ఈఈలు 2, డీఈలు 6, ఏఈలు 3 |

## వ్యాపారిపై దాడి

**ఆత్మకూరు, న్యూస్‌టుడే:** గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటనలో ఓ వ్యాపారి గాయపడిన ఘటన సోమవారం రాత్రి ఆత్మకూరులో చోటు చేసుకుంది. రాజస్థాన్‌కి చెందిన మహేంద్ర ఆత్మకూరు మండల కేంద్రంలో ఫ్లైవుడ్ దుకాణం నిర్వహిస్తున్నాడు. అందరి కంటే సామగ్రిని తక్కువ ధరకు ఇస్తుండటంతో స్థానిక వ్యాపారులు గతంలో హెచ్చరించారు. అయితే సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడి దాడికి యత్నించారు. మహేంద్ర ప్రతిఘటించడంతో దుండగులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.